# గాంధీ నుంచి పారిపోయిన కరోనా బాధితుడు

## అప్రమత్తం అయిన పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో కరోనా వైరస్ విజృంభిస్తోన్న వేళ ఓ బాధితుడు ఆసుపత్రి నుంచి పరారవ్వడం కలకలం రేపుతోంది. గద్వాలకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి ఐసోలేషన్ వార్డు నుంచి పారిపోయినట్లు ఆసుపత్రి సిబ్బంది వెల్లడించింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బాధితుడి ఆచూకీ కోసం నగరంలోని చిలకలగూడ పోలీసులతో పాటు.. గద్వాల పోలీసులు కూడా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా అతడికి కరోనా పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఇటీవలే గద్వాల నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే తెలంగాణలో కరోనా బాధితుల సంఖ్య 330ను దాటేసింది. 11 మంది మృత్యువాత పడగా.. 33 మంది డిశ్చార్జ్ అయ్యారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 7-4-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 216 | పేజీలు: 4 | వెల: రూ.1/-




.పంజాగుట్టలో స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలించిన మంత్రులు కెటిఆర్, తలసాని తదితరులు

# పంజాగుట్టలో స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలించిన కేటీఆర్

హైదరాబాద్: నగరంలోని పంజాగుట్ట నాగార్జున సర్కిల్‌లో జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు పరిశీలించారు. శ్మశానవాటిక వద్ద ట్రాఫిక్ సవ్యంగా సాగేందుకు రూ. 23 కోట్ల వ్యయంతో చేపట్టిన రెండు లైన్ల ర్యాంప్ పనులను పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి పరిశీలించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య ఉన్న చోట పనుల్లో వేగం పెంచాలని, మే 15 నాటికి పనులను పూర్తి చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా అమీంపేటలోని జీహెచ్‌ఎంసీ అన్నపూర్ణ ఉచిత ఆహార పంపిణీ కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కేంద్రంలో అందుతున్న సేవలను గురించి అక్కడున్నవారిని అడిగి తెలుసుకున్నారు.

# బ్రిటన్‌లో చిక్కుకున్న తెలంగాణ విద్యార్థులు

## వారిని వెనక్కి రంప్పించాలని ఎంపి లేఖ

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): బ్రిటన్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ విద్యార్థులను వెనక్కు తీసుకురావాలని చేవెళ్ల ఎంపీ డా. జీ రంజిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అక్కడ ఉన్న అనేకమంది కరోనా భయంతో ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఈ మేరకు ఆయన విదేశాంగమంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో భారత్‌లో చిక్కుకుపోయిన ఐరోపా దేశాలకు చెందినవారిని తిరిగి పంపిచడానికి ఎయిర్ ఇండియా ఆరు విమానాలను నడుపుతున్నదని, అవి తిరిగి వచ్చేటప్పుడు అక్కడ ఉన్న భారతీయులను తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐరోపాలోని వివిధ వర్సిటీలకు చెందిన 380 మంది విద్యార్థులు తాము భారత్‌కు వెళ్లేందుకు సహాయం చేయాలని యూకేలోని ఇండియన్ హైకమినర్‌ను కోరారని, అందులో తెలంగాణకు చెందిన 50 మంది విద్యార్థులు ఉన్నారని, వారిని రక్షించాలని అన్నారు. ఐరోపా దేశాల్లో కరోనా వైరస్ విళయ తాండవం చేస్తున్నది. అక్కడ ఇప్పటికే లక్షల్లో కేసులు నమోదవగా, వేల మంది మరణించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో అక్కడ చిక్కుకుపోయిన మనవారిని స్వదేశానికి తీసుకురావాలని ఆయన కోరారు. దీంతో వారు స్వదేశం చేరుకుని బతికి బట్టకలగరని అన్నారు.

# జమాతే చీఫ్ తీరుపై ముస్లిం మత పెద్దల ఆగ్రహం

## సూచనలు పాటించకుండా సమావేశాల నిర్వహణపై మండిపాటు

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ ప్రబలేందుకు కారణమైన తబ్లిగ్ జమాత్ చీఫ్‌పై పలువురు ముస్లిమ్ మతాధికారులు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో కరోనా వైరస్ ప్రబలుతున్న తరుణంలో మార్చి నెలలో నిజాముద్దీన్ తబ్లిగ్ జమాత్ సమావేశాన్ని రద్దు చేయాలని జమాత్ చీఫ్ మౌలానా ముహమ్మద్ సాద్‌కు పలువురు సీనియర్ ముస్లిమ్ మతాధికారులు, మేధావులు, అతని సహాయకులు సలహా ఇచ్చినా వినలేదని వెల్లడైంది. జమాత్ చీఫ్ సాద్ తన మొండివైఖరితో గుడ్డిగా సమావేశం పెట్టి జమాత్ అనుచరులను ప్రమాదంలోకి పడేశాడని పలువురు ఆరోపించారు. దేశంలో జమాత్ సమావేశం వల్లనే 30 శాతానికి పైగా కరోనా కేసులు బయటపడిన నేపథ్యంలో పరారీలో ఉన్న జమాత్ చీఫ్ పై ముస్లిమ్ మతాధికారులే విమర్శలు కురిపిస్తున్నారు. జమాత్ చీఫ్ తన మొండి వైఖరి, అజ్ఞానంతోనే అనుచరులను ప్రమాదంలో పడేశాడని జమాత్ నాయకుడు ముహమ్మద్ ఆలం విమర్శించారు. కరోనా వైరస్ పరీక్షలు చేయించుకోకుండా జమాత్ చీఫ్ అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్లారని తబ్లిగ్ సభ్యుడు లియాఖత్ అలీఖాన్ ప్రశ్నించారు. తాము సమావేశం రద్దు చేయాలని పదే పదే చేసిన అభ్యర్థనలను తబ్లిగ్ జమాత్ చీఫ్ వినలేదని పలువురు తబ్లిగ్ జమాత్ నేతలు చెప్పారు. ఢిల్లీ సమావేశాన్ని రద్దు చేయాలని తాము ఇచ్చిన సలహాను చీఫ్ పాటించలేదని కాంగ్రెస్ నాయకుడు మీమ్ అఫ్జల్, మరో ముస్లిమ్ నాయకుడు జాఫర్ సారేశ్వాలాలు వివరించారు.

# లాక్‌డౌన్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## విద్యార్థులకు కెటిఆర్ సూచనలు

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి నియంత్రణకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ఎవరికి వారు తమకు తోచిన విధంగ ఆ కాలక్షేపం చేస్తున్నారు. లాక్‌డౌన్ సమయాన్ని పిల్లలు, కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కేటీఆర్ సూచించారు. లాక్‌డౌన్‌తో ఇళ్లకే పరిమితమైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కేటీఆర్ ట్విటర్ వేదికగా పలు సూచనలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ టీ-సాట్ ఛానెళ్ల ద్వారా ఇంటివద్దనే గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, మరెన్నో నేర్చుకోవచ్చు న్నారు. నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావచ్చు. టీ-సాట్ విద్య, నిపుణ ఛానెళ్ల ప్రసారాలు కేబుల్ నెట్వర్క్ ద్వారా, వెబ్‌సైట్ అందుబాటులో ఉంటాయని కేటీఆర్ పేర్కొన్నారు. టీ-సాట్ టెలివిజన్ ఛానళ్లు పంచ సూత్రాలను ఎంచుకుని వాటి అమలే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి, వైద్యం, ఆరోగ్యం వంటి పంచ సూత్రాలను సంపూర్ణంగా ప్రజలకు అందించేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్న విషయం తెలిసిందే.

## చరిత్రలో నేటినిజం



కం॥ ఆ మని వతె ముదము నాసగి
శేముషీ అడుత చెలగు "సుచిత్రాసేనుస్
సామాన్యుల తో బాటుగ
ధీమాన్యులు కొలుచురు ఘన తేజస్వినిగన్ !!



(ఏప్రిల్ 6 సుచిత్రాసేన్ జననం)

-రాధశ్రీ
సెల్: 9494481210

# చైనాలో వెలుగులోకి వస్తున్న కొత్త కేసులు

బీజింగ్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ఉద్భవించిన చైనా దేశంలోనూ ఇంకా కొత్త కేసులు వెలుగు చూస్తూనే ఉన్నాయి. సోమవారం కొత్తగా 39 మందికి కరోనా వైరస్ సోకిందని తేలింది. కరోనా వైరస్‌కు కేంద్ర స్థానమైన వూహాన్ నగరంలో క్రమంగా ఒకవైపు సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. మరోవైపు దేశంలో కరోనా పాజిటివ్ కేసులు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. చైనాలో 81,669 మందికి కరోనా సోకగా వీరిలో 3,329 మంది మరణించారు. ఒకవైపు కరోనా వైరస్ తగ్గిందని భావిస్తుంటే మరోవైపు కొత్తగా కేసులు బయటపడటం చైనా వాసులను ఆందోళన కలిగిస్తోంది.

# ఊపిరి పీల్చుకున్న సింగర్ కనికా కపూర్

## నెగెటివ్ రిపోర్టు రావడంతో డిశ్చార్జ్

## దూరంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్న వైద్యులు

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కొద్ది రోజులుగా కరోనాతో బాధపడుతున్న బాలీవుడ్ సింగర్ కనికా కపూర్ ఎట్టకేలకి ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. మార్చి 9న లండన్ నుంచి ముంబై వచ్చిన ఆమెకు కరోనా అంటుకుంది. అయితే అది తెలియని కనీనా అక్కడి నుంచి కాన్పూర్, లక్నో వెళ్లారు. అక్కడ ఓ విందులో ప్రముఖులతో కలిసి పాల్గొన్నారు. ఆ తర్వాత దగ్గు, జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబసభ్యులు కనికాను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు జరిపిన పరీక్షలలో ఆమెకి పాజిటివ్‌గా తేలడంతో గత 15 రోజులుగా ఆమె ఉత్తరప్రదేశ్‌లోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతున్నరు. నాలుగు సార్లు టెస్ట్ నిర్వహించినా పాజిటివ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఇటీవల కనికాకు ఐదోసారి నిర్వహించిన కోవిడ్-19 పరీక్షల్లో నెగెటివ్‌గా తేలింది. అయినప్పటికీ కొన్నిరోజులు ఆసుపత్రిలో ఉంచి సోమవారం 6వ టెస్ట్ నిర్వహించారు. నెగెటివ్ రావడంతో సోమవారం హాస్పిటల్ నుండి ఆమెను డిశ్చార్జ్ చేసినట్లు తెలుస్తుంది. అయితే ఆమె కొన్నిరోజులు ఇంటి సభ్యులకు దూరంగా ఉండడంతో పాటు, తగు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా డాక్టర్స్ సూచించినట్లు సమాచారం. రెండు వారాలుగా పిల్లలని, కుటుంబాన్ని మిస్ అవుతూ వచ్చిన కనికా అత్యంత మనోవేదన చెందిన సంగతి తెలిసిందే.

# కరోనాపై ఓ రకమైన యుద్ధమే చేస్తున్నాం

## ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే సమస్యే లేదు

## రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో మరింత ముందుకు

## మన పోరాటాన్ని అభినందించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

## బిజెపి కార్యకర్తలు టాస్క్ మేరకు సాగాలి

## వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాని మోదీ వీడియో సందేశం

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారిని అంతం చేసేదాకా పోరాటం ఆగదు.. ఇందుకు ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ప్రజలు ఇప్పుడు చేస్తున్నది ఓ రకం యుద్ధమేనని అని ప్రకటించారు. ప్రస్తుతం మనం మానవాళిని కాపాడడానికి యుద్ధం చేస్తున్నామని ఆయన అన్నారు. బీజేపీ 40వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ వీడియో సందేశంలో మాట్లాడారు. కరోనాను ఓడించేదాకా సుదీర్ఘపోరాటం చేస్తామని, ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే సమస్యే లేదని ఆయన చెప్పుకొచ్చారు. చాలా కష్టకాలంలో ఉన్నామని, అందరం మరింత ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజలు తప్పకుండా.. సామాజిక దూరాన్ని పాటించాలని, ఇళ్ల నుంచి బయటకు వెళ్లినప్పుడల్లా ముఖానికి మాస్క్ ధరించాలని ఆయన సూచించారు. మన పోరాటాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అభినందించిందన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త తన కుటుంబాన్ని, తన సమాజాన్ని సురక్షితంగా ఉంచుతారని ఆశిస్తున్నానని, అందరం కలిసి విజయం వైపు నడవాలని మోడీ పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ పీఎం కేర్స్ ఫండ్‌కు సహకరించాలని, ఒక్కొక్కరు మరో 40మందిని చైతన్యపర్చాలని బీజేపీ కార్యకర్తలకు ఆయన పిలుపు నిచ్చారు. మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడటానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నామని మోడీ పేర్కొన్నారు. దేశంలో కరోనా కట్టడికి అనేక చర్యలు తీసుకుంటున్నామని, అనేక రంగాల నిపుణులతో కలిసి కీలక నిర్ణయాలు తీసుకున్నామని, దేశ ప్రజలు ఎంతో ఐక్యతను చాటుతున్నారని ఆయన అన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రజలందరూ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటున్నారని, కరోనాను తరిమికొట్టేందుకు కంకణం కట్టుకున్నారని ఆయన ప్రశంసించారు. లాక్‌డౌన్ నేపథ్యాన్ని అర్థం చేసుకుంటూ స్వీయనియంత్రణ పాటించి, ఈ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని మోడీ కొనియాడారు. దేశవ్యాప్తంగా కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు చేస్తున్న పోరులో భారతీయులందరినీ ఏకం చేసేందుకు వివిధ కార్యక్రమాలకు పిలుపునిస్తున్న ప్రధాని మోదీ తాజాగా భాజపా కార్యకర్తలకు మరో టాస్క్ ఇచ్చారు. నేడు భాజపా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కొవిడ్‌పై పోరాడుతున్న వారికి సంఘీబావంగా కార్యకర్తలంతా ఒకపూట భోజనం మానెయ్యా లన్న పార్టీ సూచనను ప్రతిఒక్కరూ ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. పార్టీ జెండా ఆవిష్కరణలో సామాజిక దూరం పాటించాలని సూచించారు. పార్టీని ఈ స్థాయికి తీసుకురావడంలో అనేక మంది కార్యకర్తలు కృషి చేశారని.. వారి త్యాగ ఫలితంగానే నేడు ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని వ్యాఖ్యానించారు. బీజేపీ కార్యకర్తలకు మోదీ పంచ సూత్రాలు చెప్పారు. వీడియో సందేశం ద్వారా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన పార్టీకన్నా దేశమే ముఖ్యమని చెప్పారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో సేవా కార్యక్రమలలో పాల్గొనే వారు తప్పక మాస్కులు ధరించాలని సూచించారు. ప్రతి కార్యకర్తా పేదలకు రేషన్ అందేలా చూడాలన్నారు. కనీసం ఐదుగురికి మాస్క్‌లు అందేలా చూడాలన్నారు. కరోనాపై పోరాడుతున్న యోధులకు ధన్యవాదాలు తెలియజేయాలన్నారు. కేంద్రం విడుదల చేసిన ఆరోగ్య సేతు యాప్‌ను కనీసం 40 మంది డౌన్‌లౌడ్ చేసుకునేలా చూడాలన్నారు. పీఎం కేర్ ఫండ్‌కు విరాళాలిచ్చేలా కనీసం 40 మందిని ప్రోత్సహించాలన్నారు.

## సామాజిక దూరం పాటిస్తూ ముందుకు: నడ్డా

అంతకు ముందు పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్యకర్తలకు సందేశం ఇచ్చారు. పార్టీ కార్యాలయాల్లో జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆ సమయంలో సామాజిక దూరం పాటించా లని సూచించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పించాలని కోరారు. లాక్‌డౌన్‌తో కష్టాలు ఎదుర్కొంటున్న ప్రజలకు వివిధ రూపాల్లో సంఘీభావం తెలపాలన్నారు. అందులో భాగంగా ఒకపూట భోజనం మానెయ్యాలని పిలుపునిచ్చారు. 'ఫీడ్ ద నీడ్' కార్యక్రమంలో భాగంగా ప్రతి కార్యకర్త ఆరుగురికి భోజనం అందించాలని కోరారు. పోలింగ్ కేంద్రం స్థాయిలో ప్రతిఒక్కరూ మరో ఇద్దరికి మాస్క్‌లు అందజేయాలని సూచించారు. ఈ కష్టకాలంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ధన్యవాద లేఖలు అందించాలన్నారు. స్థానికంగా ఉండే కరోనా యోధులకు కృతజ్ఞతా లేఖలు ఇవ్వాలన్నారు.

# తెలంగాణలో పెరుగుతున్ కరోనా కేసులు

## కట్టడికి పక్కాగా చర్యలకు రంగం సిద్ధం

## హిస్టరీ లేకున్నా నగరంలో ఒకరికి కరోనా పాజిటివ్

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కార్డన్ ఆఫ్ వంటివి చేపట్టాలని తెలంగాణా ప్రభుత్వం ఆలోచిస్తోంది. కరోనా వైరస్ తెలంగాణ రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తుంది. ఈ నేపథ్యంలో కరోనా కట్టడి కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలకి అనుగుణంగా చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ పోలీస్ - వైద్య అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే మర్కజ్ సంబంధీకులున్న ప్రాంతాల జియోట్యాగింగ్ పనులు వేగంగా చేస్తున్నారు. తెలంగాణలో పాజిటివ్ కేసులున్న వారి ఇళ్ల చుట్టుపక్కల కిలోమీటరు పరిధి వరకు వైద్యశాఖ బృందాలతో ఇంటింటికీ ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేయనున్నారు. ఈ సర్వే ఆధారంగా జ్వరం - జలుబు - ఇతరత్రా కరోనా లక్షణాలున్నట్లు అనుమానా లుంటే వారి రక్త నమూనాలని తీసుకోని - ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పరీక్షా కేంద్రాలకు పంపించి ఎంతమందికి కరోనా పాజిటివ్ ఉన్నదీ తెలుసుకుంటారు. ఇలా ఒకే ప్రాంతంలో పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్నట్లయితే ఆప్రాంతంలోని వారు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా - ఇతరప్రాంతాల వారు ఆ ప్రాంతంలోకి రాకుండా పోలీసులు నిర్వహించే సర్వే ఆధారంగా చర్యలు తీసుకుంటారు. రాష్ట్రంలో కరోనా మహమ్మారిలా మారుతోంది. పది రోజుల్లోనే కేసుల సంఖ్య ఐదు రెట్లు పెరిగింది. గడిచిన నాలుగు రోజుల్లోనే ఏకంగా 207 మందికి వైరస్ పాజిటివ్ వచ్చింది. దీంతో రాష్ట్రంలో కరోనా పాజిటివ్ సంఖ్య 334కు చేరింది. ఇందులో 80 శాతానికిపైగా కేసులు ఢిల్లీ మర్కజ్ లింక్ ఉన్నవే కావడం గమనార్హం. వచ్చేవారం రోజుల్లో ఇట్లాంటి కేసులు మరిన్ని బయటపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం వైరస్ పాజిటివ్ వచ్చిన 62 మందిలో 52 మంది హైదరాబాద్ జిల్లాకు చెందినవారే ఉన్నారు. శనివారం నాటికి హైదరాబాద్‌లో యాక్టివ్ కేసులు 93 ఉంటే.. ఆదివారం నాటికి 145కు చేరినట్టు హెల్త్ డిపార్ట్మంట్ బులెటిన్‌లో వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలో మరణించిన ఏడుగురు, డిశ్చార్జి అశ్చార్జి యిన 11 మందితో కలిపితే హైదరాబాద్‌లో కరోనా బారినవడ్డ వారి సంఖ్య 163కు చేరుతోంది. ఇక ఆదివారంనాటి కేసుల్లో ములుగు, వరంగల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల్లో 2 కేసుల చొప్పున, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి. ఈ ఐదు వారాల్లో ప్రతి వారం కేసుల సంఖ్య పెరుగుతూ పోయింది. గత పది రోజుల్లో కేసుల సంఖ్య ఐదు రెట్లు పెరిగింది. గత వారం ఏకంగా 267 కేసులు నమోదయ్యాయి.

తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. నగరంలోని మణికొండలో ఓ వ్యక్తికి ఎలాంటి ట్రావెల్ హిస్టరీ లేకపోయినా కరోనా ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో మణికొండ వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఆ వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. లాక్ డౌన్ అయినప్పటి నుంచి తాను బయటకు రాకుండా పూర్తిగా ఇంట్లోనే ఉన్నప్పటికీ పాజిటీవ్ ఎలా వచ్చిందో అర్థం కాలేదన్నారు. దీంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ఆయన ఎప్పుడు ఎక్కడెక్కడికి వెళ్లిందీ.. ఎవరెవరిని కలిసిందీ ఆరా తీస్తున్నారు. అలాగే అతను నివసిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు ఇంటికే పరిమితం అవ్వాలని ఆదేశించారు. బయటవారిని అపార్టుమెంట్‌లోకి అనుమతించడంలేదు.

తయెత్తు కట్టించుకున్న వ్యక్తికిపాజిటివ్

హైదరాబాద్ నగరంలో ఓ కరోనా పాజిటివ్ కేసు సంచలనం సృష్టిస్తోంది. తాయెత్తు కట్టించుకోవడం వల్ల అతనికి కరోనా సోకిందని సమాచారం. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన ఓ యువకుడు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా భూతాన్ని తరమడానికి తావీదును నమ్ముకున్నాడు. ఆలోచన వచ్చిందే తడవుగా ఓ దర్గాకు వెళ్లి తాయెత్తు కట్టించుకున్నాడు. ఇక తనకు రాదనుకుని హాయిగా ఉన్నాడు. తర్వాత కొద్ది రోజులకు హాస్పిటల్‌కు వెళ్లి చెక్ చేసుకోగా అతనికి కరోనా పాజిటివ్ అని తేలింది. దీనిపై దర్యాప్తు చేయగా... ఆ తాయెత్తు కట్టిన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకుని క్వారంటైన్‌లో పెట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆస్పత్రికి వెళ్లేందుకు సాయం కోసం వినతి

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో భాగంగా దేశంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనారోగ్యం పాలైన కొందరిని హాస్పిటల్‌కు తరలించేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మంచిర్యాల జిల్లా కొత్తకొమ్ము గూడేనికి చెందిన ఓ వ్యక్తి తన భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సాయం చేయాలని. ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్‌ను కోరాడు. ఆ వ్యక్తి ట్వీట్‌ను చూసిన కేటీఆర్ బాధితురాలిని హాస్పిటల్‌కు తరలించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించారు. కేటీఆర్ ఆదేశం మేరకు బాధితురాలిని సీఐ నారాయణ్ నాయక్ స్వయంగా తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

# ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ బృందాలు

## షాద్‌నగర్ మున్సిపాలిటీపై ప్రత్యేక నిఘా

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నగర శివారులోని చేగూరులో కరోనా వైరస్ (కొవిడ్-19)తో మహిళ మృతిచెందిన నేపథ్యంలో.. చుట్టుపక్కల ప్రాంతాలను వైద్యారోగ్య శాఖాధికారులు జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే చేగూరు గ్రామం చుట్టూ 3 కి.మీ. పరిధిలో దిగ్బంధనం చేసి రాకపోకలను పూర్తిగా నిషేధించారు. మృతి చెందిన మహిళ ఎక్కడెక్కడ చికిత్స కోసం వెళ్లిందో ఆయా ప్రాంతాలతోపాటు చేగూరు చుట్టుపక్కల ఉన్న మండలాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఉదయం, సాయంత్రం.. ఇలా రెండుసార్లు వైద్యారోగ్య శాఖ బృందాలు ఇంటింటికి వెళ్లి ఎవరైనా అనుమానితులు ఉంటే గుర్తించి వెంటనే క్వారంటైన్ కేంద్రాలకు పంపించే ఏర్పాట్లు చేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందూనాయక్ ఆధ్వర్యంలో 94 బృందాలను ఏర్పాటచేశారు. ప్రతి 5వేల మంది జనాభాకు ఒక బృందం చొప్పున పనిచేస్తోంది. రానున్న రోజుల్లో కేసుల సంఖ్య ఆధారంగా బృందాలను పెంచే యోచనలో ఉన్నట్లు చందూనాయక్ తెలిపారు. చేగూరులో ఈనెల 1న కరోనా వైరస్‌తో ఓ మహిళ మృతి చెందిన సంగతి తెలిసిందే. చేగూరు గ్రామంతోపాటు నందిగామ, కొత్తూరు, ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాలపై అధికారులు దృష్టి సారించారు. కలెక్టర్ అమోయ్‌కుమార్, సైబరాబాద్ కమిషనర్ వీసీ.సజ్జనార్ ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇప్పటికే చేగూరులో ఇద్దరు పోలీసులు, ఆశ వర్కర్లతో ఉదయం, సాయంత్రం మైకుల్లో ప్రచారం చేస్తూ.. ప్రజలెవర్నీ ఇంట్లోంచి బయటకు రావొద్దని సూచిస్తున్నారు. మరో పది మంది కానిస్టేబుళ్లను గ్రామం చుట్టూ 3 కిలోమీటర్ల పరిధిలో పహారా ఏర్పాటు చేసి ఎవరూ రాకుండా నిరోధిస్తున్నారు. స్థానిక ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులతో ప్రత్యేక బృందాలు నియమించి ఇంటింటికి వెళ్లి చేయిస్తున్నారు. ఆయా మండలాలతోపాటు షాద్‌నగర్ మున్సిపాలిటీలోనూ బృందాలు పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం షాద్‌నగర్‌లో ఓ అనుమానిత వ్యక్తిని వైద్యారోగ్య శాఖ బృందం గుర్తించి క్వారంటైన్ కేంద్రానికి పంపించారు. ఇతను దిల్లీలో ప్రార్థనలకు వెళ్లి వచ్చినట్లు గుర్తించారు. చేగూరులో మృతి చెందిన మహిళకు బిహార్‌వాసుల నుంచి కరోనా సోకినట్లు అధికారులు అనుమానించి క్వారంటైన్‌కు తరలించారు. వారికి శనివారం పరీక్షలు చేయగా ఆదివారం ఫలితాలు వచ్చాయి. ఇందులో నెగిటివ్ వచ్చినట్లు తేలింది. మరోవైపు బిహార్‌వాసులను 28 రోజుల వరకు క్వారంటైన్‌లోని ఉంచాలని నిర్ణయించారు. వారం తర్వాత మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

# సోషల్ డిస్టెన్స్ పాటించకపోతే క్రిమినల్ చర్యలు: ఒడిశా సీఎం

భువనేశ్వర్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): ఒడిశాలో గత కొన్ని రోజులుగా కరోనా కేసులు మెల్లమెల్లగా విస్తరించాయి. కానీ ఆదివారం ఒక్కరోజే కొత్తగా 18 కేసులు నమోదవడంతో మొత్తం కేసుల సంఖ్య 39కి చేరింది. దీంతో ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ రాష్ట్ర ప్రజలను అప్రమత్తం చేశారు.

ప్రతి ఒక్కరూ కచ్చితంగా సామాజిక దూరం పాటించాలని, లేదంటే క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కరోనావైరన్ పై పోరాటానికి ప్రజలంతా సహకరించాలని ట్విట్టర్ వేదికగా అభ్యర్థించారు. ఎక్కువ కేసులు రాజధాని భువనేశ్వర్‌లోనే నమోదయ్యాయన్న ఆయన.. ప్రజలు భయపడవద్దని కోరారు. అయితే లాక్‌డౌన్ నిబంధనలు పాటించకపోతే మాత్రం పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని నవీన్ పట్నాయక్ హెచ్చరించారు. ప్రతీ రోజు నమస్తే తెలంగాణ తాజా వార్తలు కథనాలు కోసం ఈ లింక్ ను క్లిక్ చేసి .. టెలిగ్రామ్ యాప్ ను సబ్ స్క్రైబ్ చేసుకోగలరు..

# రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని జీతాల్లో 30శాతం కోత

## కేంద్రమంత్రులతో పాటు, ఎంపిలు,గవర్నర్లకూ వర్తింపు

## ఏడాదిపాటు ఇది అమలుకు చర్యలు

## రెండేళ్లపాటు ఎంపిల్యాడ్స్ నిధుల నిలిపివేత

## కరోనా నేపథ్యంలో కేంద్రకేబినేట్ నిర్ణయం

## వివరాలు వెల్లడించిన మంత్రి జవదేకర్

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో ప్రధాని సహా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రుల జీతాల్లో 30శాతం కోత పడనుంది. అలాగే వచ్చే రెండేఉళ్ల వరకు ఎంపిల్యాడ్స్ కింద నిధులు విడుదల చేయరాదని కేంద్రం నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. ప్రధాని మోదీతో పాటు ఎంపీల జీతాల్లో 30 శాతం కోత విధించారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్లు కూడా తమ వేతనంలో 30శాతం స్వచ్ఛందంగా వదులుకున్నారు. జీతాల్లో కోతకు సంబంధించిన ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి ప్రకాశ్ జవదేకర్ సోమవారం మీడియాకు వివరించారు. ప్రధాని సహా కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యుల జీతాల్లో ఏడాది పాటు 30శాతం కోత విధించామన్నారు. సామాజిక బాధ్యతగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, అన్ని రాష్ట్రాల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు స్వచ్ఛందంగా వేతనాల కోతకు ముందుకొచ్చారని వెల్లడించారు. రెండేండ్ల పాటు ఎంపీ లాడ్స్‌కు వచ్చే నిధులు రూ.7,900 కోట్లు నిధులు కూడా నిలిపివేశాం. ఎంపీ లాడ్స్‌కు చెందిన నిధులను జాతి నిర్మాణం కోసం వినియోగిస్తాం. 2020 ఏప్రిల్ 1 నుంచి ఏడాది పాటు జీతాల్లో కోత అమలు చేస్తాం. వేతనాల కోత ద్వారా సమకూరిన సొమ్మును కన్సాలిడేటెడ్ ఫండ్‌కు జమ చేస్తామని జవదేకర్ పేర్కొన్నారు. కరోనాపై పోరాటంలో భాగంగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. కరోనాను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మంత్రులు పలు సలహాలు ఇచ్చారని కేంద్ర సమాచార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. ఈ సమావేశంలో రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ప్రధాని, కేంద్ర మంత్రులు, ఎంపీల జీతాల్లో ఏడాది పాటు 30 శాతం కోత విధిస్తూ ఆర్డినెన్స్ తీసుకురానున్నట్లు వివరించారాయన. అలాగే ఎంపీ లాడ్స్ నిధులను రెండేళ్ల పాటు నిలిపేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మొత్తం సొమ్మును కన్సాలిడేటెడ్ ఫండ్‌కు బదిలీ చేయనున్నామన్నారు. అలాగే అన్ని రాష్ట్రాల గవర్నర్లు కూడా ఏడాది పాటు తమ జీతాల్లో 30 శాతం కోతకు అంగీకరిస్తూ లెటర్లు పంపారన్నారు.

# ఆర్థిక వృద్ధిరేటు సాధించడం సవాలే.

నేటినిజం

మంగళవారం 7-4-2020

దేశంలో వినియోగం భారీగా తగ్గిపోయింది. దీనితో ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు గణనీయంగా తగ్గిపోతుంది. లాక్‌డౌన్ కారణంగా కొన్ని సంస్థలు మూతపడ్డాయి. ప్రజలు కేవలం నిత్యవసర వస్తువ్షలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కావ్షన అన్ని రంగాలు మూతపడడం వల్ల ఆర్థికవ్యవస్థ కకావికలం కానుందని అంచనావేశారు.. ఆర్థికవిశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఆర్థికవ్యవస్థ పునర్జీవనం జరగాలంటే 2021-22, 2022-23 సంవత్సరాలకు పడుతుందని అంచనా వేశారు. భారతదేశం అనుకున్న ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలంటే కనీసం 12 నుండి 14 శాతం వృద్ధిరేటు ఉండాలి. ఈ విపత్కర పరిస్థితిలో 2.5 శాతం వృద్ధిరేటు సాధించడం సవాలే. ప్రపంచంలో కరోనా వైరస్ సృష్టించిన అలల తాకిడికి ప్రపంచ దేశాలన్నీ ఉక్కిరి బిక్కిరి అవుతూ చావుబతుకుల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ ఉపద్రవం అన్ని వర్గాల ప్రజా సమూహాలను నిశ్శబ్దం కౌగిలించుకుంది. వారి జీవితాలను దుర్లభం చేస్తుంది. ఈ నేపథ్యంలో కరోనా మహమ్మారి మాంద్య ప్రభావంతో సంక్షోభంలో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. అత్యత వేగంగా ఆర్థికంగా వృద్ధి చెందుతున్న దేశాలు ఈ మహమ్మారికి ప్రధాన కేంద్రంగా ఉన్నందున ఆదేశాల ఉత్పత్తి క్షీణిస్తుంది. ఫలితంగా ప్రపంచ సమిష్ఠి డిమాండ్ కుదింపుకు గురతుంది. దీనికి అదనంగా దేశాలమధ్య పర్యాటకుల, ప్రయాణికుల సంఖ్యగణనీయంగా పడిపోవటంవల్ల విమానయాన, నౌకాయాన రవాణా అతిద్య పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఈ పరిశ్రమల సాంకేతికంగా మరింత 'గుణక ప్రభావం చూపుతుంది.

కాబట్టి ఈ మహమ్మరి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను భారీ స్థాయి కుదింపుకు గురిచేసిందనేది యదార్థం. రోజురోజుకి విజృంభిస్తూ కోరలు చాస్తున్న కరోనాను కట్టడి చేయాలని ఒకసారి విస్తరిస్తే దానిని నివారించడం అంత సులభం కాదనేది ప్రపంచదేశాలే సాక్ష్యంగా కళ్లముందు కదలాడు తున్నాయని అది రాకుండా చూసుకోవడమే మన బాధ్యత అంటూ భారతీయ వైద్య పరిశోధనా మండలి హెచ్చరిస్తూనే ఉంది.

కరోనా కేసులు కోలువడమే మన బాధ్యత అంటూ భారతీయ వైద్య పరిశోధనా మండలి హెచరిస్తూనే ఉంది. కరోనా కేసులు 69 శాతం ఉధ ృతిని కేవలం 'లాక్‌డౌన్ ద్వారానే తగించడం సాధ్యపడుతుందని మార్గ నిర్దేశనం చేసింది. దీనితో ఒక్కసారిగా వేల కేసులు వచ్చిపడి వైద్య ఆరోగ్య రంగం కుదేలై పోయే దురవస్థను నివారించగలుగుతామని గట్టిగా సూచించింది.

శాస్త్రసాంకేతిక పేరు పొందిన అమెరికా, ఇటలీ, స్పెయిన్‌లు సైతం కరోనా కేసులతో బెంబే లెత్తున్నాయి. 1918లో స్వానిష్‌ఫ్లూ మహమ్మారి ప్రపంచం మీద విరుచుపడినపుడు సామాజిక దూరం లాంటి అలావాలు సానూ కూల ప్రభావం చూపినాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు కొవిడ్-19 వ్యాప్తిని అడ్డుకునేందుకు ముఖ్యమైన నిరోధకంగా సామాజిక దూరాన్ని ఎంచుకున్నాయి. అందులో అభివృద్ధి చెందిన దేశాలలో ఉన్న అవకాశాలు భారత దేశానికి లేవు. చైనా లాగా కమ్యూనిస్టు పాలనలలేదు అమెరికాలాటి ధనిక దేశంకాదు. దేశంలో అత్యంత జనాభా అతి తక్కువ సగటు వైద్య సదుపాయాలున్నాయి. దేశంలో ఎక్కువ మంది రోజువారి వేతనాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఇటువంటి పరిస్థితులో ఈ భయంకర వ్యాధి నుండి మనల్ని మనమే కాపాడుకోవాలంటే భిన్నమైన పద్ధతుల్ని అనుసరించడే మార్గం. ఈ నేపథ్యంలో భారత ప్రధానిమోడీకి భారత్‌కు ఒక అభివృద్ధి నమునా తయారు చేసుకోవాలనే సూచన మూడువారాల లాక్‌డౌన్ ప్రకటనకు దారితీసాయి.

ప్రపంచ వ్యాప్తంగా 198 దేశాల్లో కొవిడ్-19 కేసుల సంఖ్య తొలిలక్షకు చేరడానికి 67 రోజులు పడితే వాటికి మరో లక్ష చేరడానికి కేవలం 11రోజులే పట్టింది. పట్టుమని మరో 4 రోజుల్లో మరో లక్ష కేసులు నమోద అయ్యాయి.

నేడు మరింతగా విజృం భించి భారీగా 5,36,436 పాజిటివ్ కేసులు నమోదు అయినాయి. నేటికి మృతుల సంఖ్య 24,112కాగా రికవరి అయిన కేసులు 1,24,295 .ఇండియాలో తొలి యాబై కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూడడానికి 40 రోజులు పడితే నాటికి మరో యాబై జతపడటానికి 5 రోజులు పట్టింది. పిమ్మట మరో 5 రోజులో మరో 100 కేసులు నమోదు అయ్యాయి. తెలంగాణలో 69 పాజిటివ్ కేసులు నమోదుకాగా 11మందికి రికవరీ జరిగింది. నేటికి ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఈ క్లిష్ట పరిస్థితులను గట్టిక్కించేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో జనాభా మొత్తానికి హెల్త్‌ప్రొఫైల్‌ను సర్వే చేయించాలి. నేటివరకు భారత దేశంలో వందల సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. విపత్తు సమయంలో రాజకీయ పార్టీల సమన్వయం చాలా అవసరం. ప్రతిపక్షాలు అన్న తేడాలు లేకుండా అందరు కలిసి ముందుకు నడవాలి. కరోనా దెబ్బకు ఆర్థికరంగం విలవిల్లాడుతుంది. పాఠశాలలు, కాలేజీలు, మాల్స్, పరిశ్రమలు, దుకాణాలు, ఆఫీసులు, కంపెనీలన్నీ మూతపడ్డాయి. దేశంలో వినియోగం భారీగా తగ్గిపోయింది. దీనితో ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు గణనీయంగా తగ్గిపోతుంది. లాక్‌డౌన్ కారణంగా 50శాతం ఉత్పత్తి ఆగిపోయింది.. దీని విలువ సుమారు రూ. 9.10 లక్షల కోట్లు. ప్రస్తుత భారత జిడిపిలో ఇది నాలుగు శాతంగా ఉంటుందని, బ్రిటిష్ బ్రోకరేజీ సంస్థ చార్‌క్లేస్ వెల్లడించింది.

ఇదే విషయాన్ని కేర్ రేటింగ్ సంస్థ ఈ 21 రోజుల లాక్‌డౌన్‌తో రోజుకు రూ. 35వేల కోట్ల నుండి రూ. 40వేల కోట్ల చొప్పున అనగా 9.4 లక్షల కోట్ల ఉత్పత్తి నష్టపోతుందని అంచనావేసింది. ఇక మూడీస్ నివేదిక ప్రకారం 2020 జిడిపి వృద్ధిరేటు 5.3 శాతం ఉంటుందని మూడు వారాల క్రితం అంచనా వేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ వృద్ధిరేటు 2.5 శాతానికి సవరిస్తూ నివేదిక విడుదల చేసింది. అదే విధంగా సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియాన్ ఎకానమీ ఎన్నడూ చూడని పరిస్థితులో భారత ఆర్థిక వ్యవస్థ ఉన్నదని వ్యాఖ్యానించింది. ఈ ప్రభావంతో రూ. 30వేల కోట్ల విలువైన టూరిజం పరిశ్రమలో నాలుగు కోట్లమంది పనిచేస్తున్నారు.

ఈ లాక్‌డౌన్‌తో 12 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఏవియేషన్ ఇండస్ట్రీస్‌కి 2.2 లక్షల కోట్ల నష్టం ఇందులో 3.5 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ 21 రోజుల నష్టం ఎనిమిదివేల 200 కోట్లుగా అంచనా వేశారు. లాక్‌డౌన్ కారణంగా కొన్ని సంస్థలు మూతపడ్డాయి. ప్రజలు కేవలం నిత్యవసర వస్తువులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అన్ని రంగాలు మూతపడడం వల్ల ఆర్థిక వ్యవస్థ కకావికలం కానుందని అంచనావేశారు. ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఆర్థికవ్యవస్థ పునర్జీవనం జరగాలంటే 2021-22, 2022-23 సంవత్సరాలకు పడుతుందని అంచనా వేశారు. భారతదేశం అనుకున్న ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలంటే కనీసం 12 నుండి 14 శాతం వృద్ధిరేటు ఉండాలి. ఈ విపత్కర పరిస్థితిలో 2.5 శాతం వృద్ధిరేటు సాధించడం సవాలే.

## ఉత్పాదక రంగాన్ని దెబ్బతీసిన కరోనా

### అత్యవసర సేవలు మినహా అన్ని సేవలూ బంద్

### అన్ని రంగాలకు కరోనా సెగ

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): గతేడాది డిసెంబర్‌లో చైనాలో కరోనా వైరస్ పురుడు పోసుకున్న దగ్గర్నుంచి ప్రపంచానికి యమగండం మొదలైంది. చైనా కష్టాలు నెమ్మదిగా మిగతా దేశాలను ప్రభావితం చేస్తూ వచ్చాయి. ఆ తర్వాత వైరస్ వ్యాప్తి జరుగుతూ వచ్చింది. దీంతో ఈ ఏడాది మొదలు అన్ని దేశాల్లో కరోనా భయం కనిపించింది. ముఖ్యంగా చైనా లాక్‌డౌన్ దేశీయ ఉత్పాదక రంగాన్ని పెద్ద దెబ్బే కొట్టింది. ఇప్పుడు మన దేశంలో ఉన్న లాక్‌డౌన్ తయారీ రంగ కొన ఊపిరిని కొండెక్కించేస్తున్నది. జనవరి-మార్చి త్రైమాసికంలో ఆదాయం, లాభాలు పెద్ద ఎత్తునే పడిపోవచ్చున్న అంచనాలున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని మెజారిటీ సీఈవోలు అంటున్నారు. గత నెల ద్వితీయార్థం నుంచి మొదలైన లాక్‌డౌన్.. ఈ నెల ప్రథమార్థం వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. అత్యవసర సేవలు మినహా అన్ని సేవలూ మూతబడ్డాయి. అయితే కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో లాక్‌డౌన్ కొనసాగవచ్చున్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. స్తంభించిన వ్యాపార కార్యకలాపాలు మళ్లీ సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుందని అంటున్నారు. ప్రస్తుతం అన్ని రంగాలకు కరోనా సెగ తగులుతున్నది. దీంతో లాక్‌డౌన్ తర్వాత దాదాపు మొత్తంగా వ్యయ నియంత్రణ చర్యలు ఉంటాయని తాజా సర్వేలో మెజారిటీ సీఈవోలు సంకేతాలిచ్చారు. అయినప్పటికీ 47 శాతం సీఈవోలు.. ఉద్యోగాల్ని కోల్పోయేవారు 15 శాతం దిగువనే ఉండొచ్చునగా, 32 శాతం సీఈవోలు మాత్రం 15-30 శాతంగా ఉండొచ్చని చెప్తున్నారు. స్థూలంగా దాదాపు 52 శాతం సంస్థలు లాక్‌డౌన్ తర్వాత ఉద్యోగాల తీసివేతలు ఉంటాయని చెప్పేస్తున్నట్లు సీఐఐ తెలిపింది. దీనివల్ల జీడీపీ చాలావరకు తగ్గిపోవచ్చని హెచ్చరించింది. నిరుద్యోగం పెరిగితే మార్కెట్‌లో డిమాండ్ పడకేస్తుందని, ఫలితంగా ఉత్పత్తి కుదేలై మొత్తం ఆర్థికవ్యవస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందన్నది. దీంతో రాబోయే ఉద్యోగ కోతల్ని తేలిగ్గా తీసుకోలేమని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం ఉద్దీపన ప్యాకేజీలను ఉదారంగా ప్రకటించాలని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ ఈ సందర్భంగా కోరారు. ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్ సైతం నిపుణుల సలహాలతో ముందుకెళ్లాలని సూచిస్తున్నారు.

## కరోనా పాజిటివ్ కుటుంబాలకు హరీష్ రావు పరామర్శ

### ప్రభుత్వ ఆదేశాల మేరకు నడవాలని ప్రజలకు సూచన

### ధాన్య కొనుగోళ్లపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం

సంగారెడ్డి,ఏప్రిల్6(నేటినిజం ప్రతినిది): సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని మయూరీనగర్‌లో కరోనా పాజిటివ్ బాధితుల కుటుంబాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి వెళ్లి మంత్రి హరీష్‌రావు పరామర్శించారు. ప్రస్తుతం సదరు కుటుంబంలోని తండ్రీకొడుకులిద్దరూ హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని హరీష్‌రావు వెల్లడించారు. ఈ సాయంత్రం వీరిద్దరినీ గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్‌కు తరలిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం మయూరీనగర్ అంతా పర్యటించి.. ఆ ప్రాంతమంతా సోడియం హైపోక్లోరైడ్‌ను అధికారులతో హరీష్‌రావు స్ప్రే చేయించారు. అన్ని గ్రామాల్లో సోడియం హైపో క్లోరైడ్ స్ప్రే చేసేలా చూడడంతో పాటు ప్రజలు గుమికూడకుండా చూడాలని ప్రజాప్రతినిధులను మంత్రి హరీశ్‌రావు కోరారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు అండగా తామున్నామని అన్నారు. అందరూ సామాజిక దూరం పాటిస్తూ ప్రభుత్వ సూచనల మేరకు నడుచుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు రావొద్దని, వరికోతలు, ధాన్యం అమ్మకాల్లో అవస్థలు పడకుండా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి హరీశ్‌రావు సూచించారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో కరోనా నివారణ చర్యలు, ఉపాధి హామీ పథకం, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, నర్సరీల నిర్వహణ, డంప్‌యార్డు, శ్మశాన వాటికల నిర్మాణం, వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, వాటి నిర్వహణపై సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశర చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్నటువంటి డంప్‌యార్డు, శ్మశాన వాటికల పనులను వేగవంతం చేయాలన్నారు. ఈజీఎస్ కూలీలు పనిచేసే సమయంలో ఒకటిన్నర మీటరు దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కరోనా నేపథ్యంలో కూలీల సంఖ్య తగ్గిందని, ఆ సంఖ్యను పెంచాల్సిన అవసరముందన్నారు. వేసవి దృష్ట్యా నర్సరీల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించాలని సూచించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి సిమెంట్ ఉందని మంత్రి దృష్టికి తేగా, కలెక్టర్‌తో మాట్లాడి సిమెంట్ కొరత లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సమాచారం మేరకు రైతులు అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేయాలని కోరారు. వరికోతలు, ధాన్యంలో తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వరి, మొక్కజొన్న కేంద్రాలను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం పరిమాణాన్ని బట్టి రైతులకు టోకెన్లు జారీ చేయాలన్నారు.

## కరోనా నేపథ్యంలో పక్కాగా ధాన్యం కొరుగోళ్లు

### -మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడి

నిజామాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కామారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను 320కి పెంచబోతు న్నట్లు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. శనగ కొనుగోలు కేంద్రాలను 10 నుంచి 57కు, మొక్కజొన్న కొనుగోళ్లకు 32 నుంచి 109 సెంటర్లు, జొన్నల కొనుగోళ్లకు 6 కేంద్రాల నుంచి 25కు పెంచనున్నట్లు చెప్పారు. వలస కూలీ లు 4వేల మందిని గుర్తించి బియ్యం, నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. కరోనా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ధాన్యం కొనుగోళ్లపై పడకుండా సిఎం కెసిఆర్ పక్కాగా ఆదేశాలు ఇచ్చారని తెలిపసారు. రెండు జిల్లాల్లో కరోనా వైరస్ నియంత్రణ అదుపులోనే ఉందని, ప్రజలెవరూ భయాందోళనకు గురికావద్దని అన్నారు. మొత్తం జిల్లాలో 26 మందికి కొవిడ్ 19 పరీక్షలు జరుపగా.. ఇందులో 23 మందికి నెగిటివ్ రిపోర్ట్ వచ్చిందన్నారు. ఒకరికి పాజిటివ్ రాగా.. మరో ఇద్దరి ఫలితాలు రావాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. లాక్‌డౌన్‌కు కట్టుబడి మరికొన్ని రోజులు ప్రజలు ఇంటికే పరిమితం కావాలని పిలుపునిచ్చారు. విదేశాల నుంచి వచ్చిన వారందరినీ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉంచినట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో నిత్యావసరాలు రెండు నెలలకు సరిపోయేంతగా నిల్వలు ఉన్నాయని, ప్రజలెవ్వరూ ఆందోళన చెందొద్దని తెలిపారు.

# సంక్షోభం నుంచి గట్టెక్కే చర్యలకు పూనుకోవాలి

హైదరాబాద్, ఏప్రిల్ 6:ప్రధాని మోడీ పిలుపు మేరకు దీపాలు వెలిగించి మన ఐక్యతను చాటడం ద్వారా కరోనా మహమ్మారిపై పోరులో దేశమంతా ఒక్కటిగా నిలిచింది. మొన్నటికి మొన్న అంటే గతనెల 22న లాక్‌డౌన్‌తో అంతా సాయంత్రం వరకు ఇంట్లోనే ఉండి చప్పట్లతో మద్దతు పలికారు. ఇక ముందు కూడా ఈ పోరులో అందరం ఒక్కటిగా నిలుస్తాం అన్న సంకల్పాన్ని ప్రకటించారు. ఇదంతా ప్రజల నుంచి ప్రభుత్వానికి లభించిన మద్దతు. విపక్షాలు కూడా మద్దతుగానే నిలిచారు. భగవంతుడిపై భారం వేసి ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు. నిర్భీతి విశ్వాసానికి నిదర్శనం. దేవుడున్నాడనే దృఢ భావన కారణంతో దేశ ప్రజలు ఊపిరి బిగబట్టి బతుకుతున్నారు. మనిషి నమ్మకంతో ఒక్కఅడుగు ముందుకువేస్తే, దైవం ఆ నమ్మకాన్ని పదిలం చేసేందుకు పది అడుగులు వేస్తాడు. మొదటి అడుగు మాత్రం మనిషిదే కావాలి. అలా వేసిన ప్రజలకు అండగా కేంద్రం యుద్ధప్రాతిపదికన దేశ పునర్నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ దశలో ప్రభుత్వంగా తీసుకోవాల్సిన చర్యలు కోకొల్లలు. ఈ నెల 14 తరవాత లాక్‌డౌన్ ఎత్తేస్తే సరి. మరి దీనిని పొడిగించడమో లేకపోతే పాక్షికంగా ఎత్తేయడమే జరిగితే ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ఈ ఉపద్రవం నుంచి ఇప్పటి నుంచే దేశం బయటపడేలా చూడాలి. ప్రధానంగా ఉత్పత్తి రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి చేతికి పని దక్కేలా చేయాలి. దిగుమతులపై ఆంక్షలు పెట్టడంతో పాటు ఉత్పత్తి రంగాలపై దృష్టి పెట్టాలి. ప్రజలకు పనులు దొరికేలా చేయాలి. ఆర్థికరంగం కుదేలు కాకుండా కార్మిక, కర్షక రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. భారతదేశం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దేశం కనుక వ్యవసాయ ఉత్పత్తులను పెంచేలా చర్యలు చేపట్టాలి. ఆహారపదార్థాలు ప్రజలకు దక్కేలా చూడాలి. ధరలు పెరక్కుండా చూడాలి. నిర్మాణరంగం పూర్తిగా పుంజుకునేలా చేయాలి. జిఎస్టీ, పన్నుల వసూళ్లతో భారం మోపకుండా సరళీకృత ఆర్థిక విధానాలు అవలంబించాలి. అంతేగాకుండా బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీలతో రుణాలు దక్కేలా చూసి పేద, సామాన్య ప్రజలు సొంతంగా తమకాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహించాలి. చైనా తదితర దేశాల నుంచి అదే పనిగా వస్తువుల దిగుమతిని ఆపేసి మనదేశంలోనే తయారీ రంగాన్ని ప్రోత్సహించాలి. ప్రకృతి ఉపద్రవాలు కొన్ని ప్రాంతాలకో ఒక దేశానికో పరిమిత మవు తాయి. కానీ నేడు కరోనా రూపంలో వచ్చిన ఉపద్రవం ప్రాంతాలకు దేశాలకు అతీతంగా ప్రపంచ మంతా వ్యాపించింది. ప్రకృతి ప్రకోపం చూపిస్తుంది. ఆదిమ సమాజం నుండి ఆహార సేకరణ దశ నుండి ఉత్పత్తి దశకు, వేట నుండి వ్యవసాయం వరకు, ఒంటరి జీవితం నుండి గుంపు జీవితానికి ,ఆ తర్వాత సంఘ జీవనానికి మారిన మానవులు వ్యవసాయంలో వచ్చిన అదనపు ఉత్పత్తులను దాచుకోవడానికి ఒక గూడు ఏర్పరచుకొని ఇది నాది అది నీది అని సొంత ఆస్తి గల సమాజం ఏర్పరచుకొని దాన్ని కాపాడుకోవడానికి రాజ్యాన్ని ఏర్పరచుకున్న సమాజం మనది. గ్రామాల నుండి పట్టణాలకు పట్టణాల నుంచి నగరాలకు దేశాలకు ఆకాశమే హద్దుగా మానవ జీవనయానం కొనసాగుతూనే ఉంది. ఇది ఆగని మహాప్రస్థానం. దీనికి ఆది ,అంతం లేదు ఆద్యంతాలు లేని ప్రయాణం ఇది. ఈ ప్రయాణంలో ఒడిదుడుకులు సహజం. వీటన్నింటినీ తట్టుకుని తమ సంకల్పాన్ని దృఢపర్చుకుని మళ్లీమళ్లీ మానవ సమాజం ముందుకు సాగుతూనే ఉంది. ఆశావహ దృక్పథంతో సాగితే మానవుడే మహనీయుడుగా ఎన్నో విజయాలు సాధించారు. అలాకాకుండా నిరాశతో ఆగితే సమాజ గతి ముందుకు సాగదు. ప్రకృతి అప్పుడప్పుడు పరిస్థితులను సమతుల్యం చేస్తుంది. అందులో భాగంగానే మనకు ఇప్పుడు వచ్చిన కరోనా కష్టం .రెండు మూడు నెలల్లో దీన్ని అధిగమిస్తాం అన్న భరోసా ఇవ్వడం వేరు. అధిగమించడానికి చేతల్లో చూపడం వేరు. భారతీయ ఆత్మ గ్రామాల్లో ఉందన్న మహాత్మాగాంధీ మాటను మరోసారి గుర్తు చేస్తూ ప్రభుత్వ పరంగా గ్రామీణ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసే చర్యలకు ఉపక్రమించాలి. కులవృత్తులను పెద్ద ఎత్తున ప్రోత్స హించాలి. విదేశీ వస్తు వాడకంపై లాక్‌డౌన్ విధించుకోవాలి. వాటిని వాడడం ఆపేస్తే తప్ప మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడదు. అమెరికాలో పరిస్థితి ఇప్పుడప్పుడే మెరుగుపడే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో అమెరికాలో స్థిరపడాలన్న తమ ఆశలకు సంకెళ్లు పడ్డాయంటూ భారతీయులు ఆవేదన చెందుతున్నారు. చాలా మంది విద్యార్థులు విదేశాలు వెళ్దామనే ఆలోచనను మానుకుని స్వదేశంలో చదువుకుందా మని నిర్ణయించుకుంటున్నారు. మరి కొంతమంది ఇప్పుడు కాకపోతే వచ్చే ఏడాది వెళ్దామనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరందరికి తగిన విధంగా విద్యా,ఉపాధిరంగాలను బలోపేతం చేయాలి. భారతదేశం నుంచి ప్రతి ఏడాది లక్షలాది మంది యువకులు విదేశాల్లో చదువుకునేందుకు వెళ్తుంటారు. ఈ ఏడాది కూడా చాలా మందే విదేశాల్లోని కాలేజీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఐ20 కూడా చేతికొచ్చిన తరువాత ఒక్కసారిగా కరోనా వారి ఆశలను చిదిమేసింది. కొన్ని నెలల పాటు ఏ దేశం కూడా విదేశీ విద్యార్థుల దరఖాస్తులను స్వీకరించే పరిస్థితి కనవడటం లేదు. భారత్ నుంచి అమెరికా,కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు వెళ్లాలనుకున్న వారి ఆశలపై కరోనా నీళ్లు చల్లింది. ఇలా నిరుత్సాహానికి గురైన యువతకు భరోసా నింపాల్సన బాధ్యత కూడా కేంద్రంపైనే ఉంది. ఇలా ప్రతి రంగాన్ని సమగ్రంగా పరిశీలించి ముందుకు సాగాలి. ఖర్చులను తగ్గించుకుంటూనే యువతకు ఉపాధి కల్పిస్తూ.. వస్తూత్పత్తి రంగాలను వివరివిగా ప్రోత్సహించడంతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. ఈ మహాసంక్షోభాన్ని అధిగమించడం ఇప్పుడు మోదీ ముందున్న పరీక్షగా చూడాలి. లేకుంటే దేశం తీవ్ర దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

## అర్బన్ జిల్లాలో కేసుల సంఖ్య 24కి చేరిక

### భయాందోళనలో నగర ప్రజలు

వరంగల్,ఏప్రిల్6(నేటినిజం ప్రతినిది): అర్బన్ జిల్లాలో కేసుల సంఖ్య 24కి చేరింది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత కరోనా పాజిటివ్ కేసుల్లోనూ వరంగల్ అర్బన్ జిల్లా ముందు వరుసలో ఉండడం ఆందోళనకరంగా మారింది. శనివారం వరకు 21 పాజిటివ్‌గా నమోదైన కేసుల సంఖ్య.. ఆదివారం మరో మూడు నమోదై మొత్తం 24కు చేరడం భయాందోళనకు గురిచేస్తున్నది. విదేశాలకు వెళ్లి వచ్చి క్వారంటైన్ పూర్తి చేసుకున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అలా వివిధ దేశాలకు వెళ్లి వచ్చిన వారిలో ఇంకా 12 మంది మాత్రమే హోం క్వారంటైన్‌లో ఉన్నారు. 802 మంది క్వారంటైన్ పూర్తి చేసుకున్నారు. కాగా, పాజిటివ్ వచ్చిన కేసుల్లో ఒకటి మినహ మిగతావన్నీ ఇటీవల మర్కజ్ ప్రార్థనలకు వెళ్లి వచ్చిన వారే 23 మంది కావడం మరింత కలవరానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ప్రజలు పూర్తిస్థాయిలో లాక్‌డౌన్ పాటించాలని విజ్ఞప్తి చేస్తుంది. ఇప్పటికైనా ఇంకా ఎవరైనా ఢిల్లీ ప్రార్థనలకు వెళ్లి వచ్చిన వారుంటే స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించాలని అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది. వరంగల్ ఎంజీఎంలో కొవిడ్-19 బ్లాక్‌లో వైద్యసేవలు అందిస్తున్న జిల్లా కరోనా నోడల్ అధికారి సహా ఆరుగురికి వైద్య పరీక్షల్లో నెగెటివ్ రిపోర్ట్ వచ్చిందని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ బీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇటీవల ఎంజీఎంలో కాజీపేటకు చెందిన ఓ రోగి ఢిల్లీకి వెళ్లి వచ్చిన వ ఇషయాన్ఇన గోప్యంగా ఉంచాడు. అతడికి వైద్య సేవలు చేస్తున్న క్రమంలో అనుమానం వచ్చి రక్తపరీక్షలు చేశారు. సదరు వ్యక్తికి పాజిటివ్ వచ్చింది. దీంతో ఆ యూనిట్‌లో ఉన్న ఆరుగురు వైద్యుల రక్త నమూనాలు తీసి పరీక్షకు పంపించారు. వారికి నెగెటివ్ వచ్చిందని ఆయన తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

### 376కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

నల్లగొండ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌ను పారదోలేందుకు దేశమంతటా లాక్‌డౌన్ నెలకొన్న నేపథ్యంలో పంటల కోత, విక్రయంపై స్పష్టత రావడంతో పాటు, కొనుగోళ్లకు చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా అంతటా యాసంగి వరి పంట విరివిగా పండగా.. పలు ప్రాంతాల్లో వరి చేలు కోతకు సిద్ధమయ్యాయి.

హామీ బత్తాయి, నిమ్మ కొనుగోలుకు పట్టణాల్లో మొబైల్ రైతు బజార్లు ఏర్పాటు కానున్నాయి. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లోని నాన్ ఆయకట్టు లోనూ యాసంగి వరి సాగు రికార్డు స్థాయిలో జరిగింది. కృష్ణా, గోదావరితోపాటు మూసీ నది కుడి, ఎడమ కాల్వల ద్వారా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని సుమారు 30వేల ఎకరాల ఆయకట్టులోనూ వరి పంట పండింది. ఇప్పటికే మంత్రి ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ధాన్యం కొనుగోళ్లకు ఆదేశించారు. మ్మడి జిల్లా అంతటా విస్తృతంగా వరి పంట పండగా.. దిగుబడి సైతం రికార్డు స్థాయిలో ఉండే అవకాశం ఉంది. జిల్లాలో 376కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది.ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాళ్‌కు రూ.1835, సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.1815గా మద్దతు ధర నిర్ణయించిన ప్రభుత్వం.. అంతకంటే తక్కువ ధరకు ఏ రైతు కూడా దళారులకు పంటను అమ్ముకోవద్దని చెప్పింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఐకేపీ కేంద్రాలకు ధాన్యం వస్తోంది. ఈ మేరకు ధాన్యంపై అన్ని ఏర్పాట్లు చేపట్టిన సీఎం కేసీఆర్.. అంతకు ముందే బత్తాయి, నిమ్మ సహా పండ్ల తోటల రైతులందరి గురించీ ఆలోచించారు. స్థానికంగానే పండ్ల అమ్మకాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. నల్లగొండ జిల్లా అంతటా 46,800ఎకరాల్లో బత్తాయి, 16వేల ఎకరాల్లో నిమ్మ తోటలు రైతులు సాగు చేశారు. బత్తాయి 44వేల మెట్రిక్ టన్నులు, నిమ్మ 52వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. ప్రభుత్వమే ప్రతి గింజను సైతం కొనుగోలు చేస్తుంది. వరి కోతలకు ఉపయోగించే హార్వెస్టర్ల గురించి కూడా రైతులు ఆందోళన చెందొద్దు. వరి పంట కోయడానికి ట్రాక్టర్లకు హార్వెస్టింగ్ మెషిన్లు ఎక్కిచ్చేందుకు సైతం టెక్నీషియన్లను గ్రామాలకు అనుమతించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. రైతాంగం ప్రభుత్వ సూచనలు పాటిస్తూ ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా సహకరించాలని ఎస్పీ ఏవీ రంగనాథ్ కోరారు. పలువురు రైతులతో నేరుగా మాట్లాడి సౌకర్యాల ఏర్పాట్లు, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తూకం కాంటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళు, లోడింగ్ వెంటనే జరిగే విధంగా హమాలీల కొరత లేకుండా మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# విదేశీ విద్యపై కరోనా దెబ్బ

### ఈ ఏడాది ఉన్నత విద్యకు అవకాశం లేనట్లో

### యువత ఆశలను దెబ్బతీసిన కరోనా మహమ్మారి

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): భారత్ నుంచి అమెరికా,కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు వెళ్లాలనుకున్న వారి ఆశలపై కరోనా నీళ్లు చల్లింది. ఐ20 కూడా చేతికొచ్చిన తరువాత ఒక్కసారిగా కరోనా వారి ఆశలను చిదిమేసింది. కొన్ని నెలల పాటు ఏ దేశం కూడా విదేశీ విద్యార్థుల దరఖాస్తులను స్వీకరించే పరిస్థితి కనవడటం లేదు. అమెరికాలో స్థిరపడాలన్న తమ ఆశలకు సంకెళ్లు పడ్డాయంటూ భారతీయులు ఆవేదన చెందుతున్నారు. చాలా మంది విద్యార్థులు విదేశాలు వెళ్దామనే ఆలోచనను మానుకోక తప్పని పరిస్తితి ఏర్పడింది. ఇకవీరు స్వదేశంలో చదువుకుందామని నిర్ణయం తీసుకోవాల్సిన ఆగత్యం ఏర్పడింది. మరి కొంతమంది ఇప్పుడు కాకపోతే వచ్చే ఏడాది వెళ్దామనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరందరికి తగిన విధంగా విద్యా,ఉపాధిరంగాలను బలోపేతం చేయాలి. భారతదేశం నుంచి ప్రతి ఏడాది లక్షలాది మంది యువకులు విదేశాల్లో చదువుకునేందుకు వెళ్తుంటారు. ఈ ఏడాది కూడా చాలా మందే విదేశాల్లోని కాలేజీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఆస్ట్రేలియాలోని పలు యూనివర్సిటీల్లో కూడా ఏటా భారతీయులు వెళుతుంటారు. ఇటలీ, కెనడాల నుంచి కూడా అనేకులకు అనుమతులు వచ్చాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వీరంతా భారత్‌లోనే చదువుకోవడం మినహా గత్యంతరం లేదు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదివే వారు డిసెంబర్ నెలలోనే ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ పరీక్షలు రాసేస్తారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వీరంతా విదేశాల్లోని కాలేజీలకు దరఖాస్తు పెట్టుకుంటారు. సరిగ్గా మార్చిలో ఐ20 వస్తుంది.. వీసాకు దరఖాస్తు పెట్టుకుందాం అనుకుంటుండగా కరోనా మహమ్మారి తెరపైకి వచ్చింది. ఈ కారణంగా విదేశాలు వెళ్లాలను కునే వారికి అవకాశం లేకుండాపోయింది. ఆయా దేశాలు ఇప్పుడే విదేశీ విద్యార్థులను అనుమతించకపోవచ్చు. వీరంతా ఇప్పటికే అనేక పరీక్షలకు, కాలేజీ అడ్మిషన్‌లకు చాలా ఖర్చు చేశారు. ఇప్పుడు కాకపోయినా మరో ఆరు నెలల తరువాత విదేశాలకు వెళ్లాలని నిశ్చయించుకున్నా.. అప్పటికీ పరిస్థితి మెరుగుపడుతుందన్న భరోసా లేదు. దీంతో ఈ ఏడాది భారతదేశం నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య భారీగా తగ్గే అవకాశాలు కనపడుతున్నాయి. ఆరోగ్యపరంగా, ఆర్థికంగా మానవాళి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్న కరోనా మహమ్మారి. యావత్ ప్రపంచాన్ని తన గుప్పిట బంధించిన కొవిడ్-19 దెబ్బకు భవిష్యత్ కలలన్నీ కల్లలైపోయాయి. స్తంభించిన వ్యాపార, పారిశ్రామిక ప్రపంచం.. ఉద్యోగులను ప్రభావితం చేస్తున్నది. ఈ గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు కొలువుల కోతలే దిక్కని సంస్థలు భావిస్తున్నాయి.

కరోనా వైరస్ సృష్టిస్తున్న బీభత్సంతో జన నష్టమే కాదూ.. ఆర్థిక నష్టమూ పెద్ద ఎత్తున వాటిల్లుతున్నది. ముఖ్యంగా భారత్‌కు కరోనా సెగ గట్టిగానే తగులుతున్నది. అసలే ఆర్థిక మందగమనంతో అల్లాడిపోతున్న దేశ ఆర్థికవ్యవస్థను ఈ మహమ్మారి ఏకంగా మాంద్యంలోకి పడేసింది. కరోనా కట్టడి కోసం దేశవ్యాప్తంగా అమలవుతున్న లాక్‌డౌన్.. ప్రజల ప్రాణాలను నిలబెడుతున్నా.. అన్ని రంగాలను నష్టాల ఊబిలోకి నెట్టింది. దీంతో వ్యయ నియంత్రణపై దృష్టి పెడుతున్న సంస్థలు.. భారీ ఎత్తున ఉద్యోగాలను ఎత్తివేయాలనుకుంటున్నాయి. అవును.. వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ నిర్వహించిన సీఈవోల సర్వేలో ఇదే తేలింది. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా అన్ని రంగాలకు చెందిన సంస్థల్లోని సుమారు 200 మంది సీఈవోలు పాల్గొన్నారు. ఇందులో 52 శాతం మంది లాక్‌డౌన్ తర్వాత ఉద్యోగకోతలు ఉంటాయన్నారు.



వరంగల్‌లో కరోనా ప్రభావిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులతో కలస ఇపర్యటించిన కలెక్టర్ రాజీవ్ హన్మంతు

## వరంగల్‌లో 15 ప్రాంతాల్లో కఠిన ఆంక్షలు

### నిరంతరం పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హన్మతు

### ఇళ్ల నుంచి బయటికి రావొద్దని పోలీసుల హెచ్చరిక

వరంగల్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): వరంగల్ అర్బన్ జిల్లా యంత్రాంగం కలెక్టరేట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎంజీఎం ఆస్పత్రుల్లో 24/7 పనిచేసే విధంగా మూడు వేర్వేరు హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసింది. కరోనాపై ఎవరికి ఏ విధమైన అనుమానాలున్నా, విదేశాలు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారి సమాచారం ఎప్పటికప్పుడూ అందించాలని ప్రజలకు పిలుపునిచ్చింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు సమాచారం అందిస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలోని 15 ప్రాంతాలను కదలిక నిషేధ ప్రాంతాలుగా యంత్రాంగం ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో జన సంచారాన్ని నిషేధించింది. కరోనా వైరస్ పాజిటివ్ వచ్చిన ఈ 15 ప్రాంతాలను సీజ్ చేసింది. ఈ ప్రాంతాలను నో మూవ్‌మెంట్ జోన్లుగా ప్రకటించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, సీపీ రవీందర్ ఈ ప్రాంతాల్లో వైరస్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో జులైవాడ, సుబేదారి, ఈద్గా, కుమార్‌పల్లి నుంచి లష్కర్‌బజార్, పోచమ్మమైదాన్, చార్‌బౌళి, కాశిబుగ్గ, గణెళిశ్‌నగర్, నిజాంపుర, లక్ష్మీపురం, రంగంపేట, శంభునిపేట, బాపూజీనగర్, చింతగట్టు క్యాంపు పరిధిలోని ప్రాంతాలను నో మూవ్‌మెంట్ జోన్లుగా ప్రకటించారు. ఆ ప్రాంత ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1115కు తెలియజేస్తే అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. నిర్దేశిత ప్రాంతాల్లో వైరస్ మరింత ప్రభావితం కాకుండా చేపట్టిన చర్యలకు ప్రజలు పూర్తిగా సహకరించాలని వారు కోరారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ నిత్యావసర వస్తువులు, కూరగాయ లను మొబైల్ వాహనాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఆ ఏరియాల్లో పోలీసులు బారికేడ్లను కూడా ఏర్పా టు చేసి 24 గంటలు బందోబస్తు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఆ ప్రాంతాల నుంచి బయటకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఇంటింటికీ కూరగాయలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు ముగ్గురు సభ్యులతో కలెక్టర్ ప్రత్యేక పంపిణీ బృందాలను ఏర్పాటు చేశారు. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు చేపట్టిన లాక్‌డౌన్ నేపథ్యంలో ఎవరూ బయటకు రాకుండా నిరోధించే చర్యల్లో భాగంగా పోలీస్, మార్కెటింగ్, మున్సిపాలిటీ సిబ్బందితో ఒక్కో ప్రాంతంలో రెండు బృందాలు అందుబాటులో ఉంటాయని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి మొబైల్ నంబర్లు సేకరించి రోజువారీగా కావాల్సిన వస్తువులు కొనుగోలుచేసిన అనంతరం, మార్కెట్ రేటు ప్రకారం నిత్యావసర సరుకుల మొత్తాన్ని వారి నుంచి వసూలు చేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.

## కరోనాపై పోరుకు మహారాష్ట్ర గవర్నర్ చేయూత



ముంబై,ఏప్రిల్ 6: కరోనా మహమ్మారిపై పోరాటం కోసం ఏర్పాటు చేసిన ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిచ్యుయేషన్స్ ఫండ్ (పీఎం కేర్స్ ఫండ్)కు మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి తన వంతు సాయం అందించారు. ఇప్పటికే పీఎం రిలీఫ్ ఫండ్‌కు మార్చి నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించిన ఆయన.. ఇప్పుడు పీఎం కేర్స్ ఫండ్‌కు తన వార్షిక వేతనంలో 30 శాతం సొమ్మును విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

దేశంలో కోవిడ్-19 చెలరేగడంతో ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 28న పీఎం కేర్స్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. కరోనా మహమ్మారి కారణంగా ఎలాంటి అత్యవసర, విపత్తు పరిస్థితి ఏర్పడినా బాధిత ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు ఈ ఫండ్‌లోని నిధులను వినియోగించనున్నారు. కాగా, దేశంలో గత 24 గంటల్లో కొత్తగా 700 కేసులు నమోదు కావడంతో దేశవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 4,314కు పెరిగిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సోమవారం ప్రకటించింది.

## దీపాళలను వెలిగించిన కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు

కరీంనగర్, ఏప్రిల్ 6(నేటినిజం ప్రతినిది): దేశప్రధాని నరేంద్రమోడి, రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావులు ఇచ్చిన పిలుపుమేరకు కరీంనగర్ కమీషనరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన పోలీసులు ఆదివారం నాడు రాత్రి 09గంటలకు వివిధ ప్రాంతాల్లో కొవ్వొత్తులు దీపాలను వెలిగించారు. కరీంనగర్‌లోని తెలంగాణచౌక్ వద్ద రాత్రి ఏర్పాటైన కార్యక్రమాన్ని పోలీస్ కమీషనర్ ప్రారంభించిన విషయం విదితమే.

రాత్రి తొమ్మిది గంటలకు లైట్లను ఆర్పివేసిన తర్వాత ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. బందోబస్తు విధినిర్వాహణలో ఉన్నపోలీసులు సైతం ఈ దీపాల వెలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. కమీషనరేట్ వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లు, వివిధ విభాగాలకు చెందిన కార్యాలయాల్లో ఈ కార్యక్రమం కొనసాగింది. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజల మధ్యఐక్యతను చాటిచెప్పడంతోపాటు అత్యవసర సేవలందిస్తున్న వివిధ విభాగాలకు చెందిన అధికారులు,సిబ్బందికి సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ సామాజికదూరం పాటించడం ద్వారానే ఈ వైరస్ వ్యాప్తిని నిరోధించవచ్చున్నారు. ప్రజలు నిత్యావసర వస్తువులు, మెడికల్‌షాపుల్లో మందుల కొనుగోళ్ళకు లాక్‌డౌన్ సడలింపు నిర్ణీత సమయంలో బయటకు రావాలని తెలిపారు. అనవసరంగా వాహనాలతో రోడ్లపైకి వచ్చే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరాల కోసం బయటకు వచ్చినప్పుడు అందుకు సంబంధించిన ఆధారాలను చూపాలని, ద్విచక్ర వాహనంపై ఒకరు, ఇతర వాహనాల్లో ఇద్దరు మాత్రమే నిర్ణీత సమయాల్లో బయటకు రావాలని సూచించారు. నిబంధనలను ఉల్లఘించే వాహనాలకు సంబంధించిన వాహనాలను సీజ్‌చేస్తామని స్పష్టం చేశారు. సాయంత్రం 07గంటల నుండి ఉదయం 06గంటల వరకు కర్ఫ్యూ కొనసాగుతుందని, కర్ఫ్యూ అమలులో కఠినతరంగా వ్యవహరించడం జరుగుతుందని చెప్పారు. దీపాల వెలిగించి తమ ఐక్యతను చాటి, అత్యవససేవలందిస్తున్న వివిధ విభాగాలకు చెందిన అధికారులు,సిబ్బందికి సంఘీభావాన్ని తెలిపిన పోలీసు అధికారులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), ఎసిపిలు అశోక్, శంకర్‌రాజు, శ్రీనివాస్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డిలతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



# విలవిల్లాడుతున్న అగ్రరాజ్యం అమెరికా

### దేశం మొత్తం లాక్‌డౌన్ అసాధ్యమంటున్న ట్రంప్

### న్యూయార్క్‌లో రోగులకు చికిత్సకు వైద్యుల కొరత

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా రక్కసి గుప్పిట్లో చిక్కుకొని అమెరికా విలవిల్లాడుతోంది. రాబోయే రోజులు భయంకరంగా ఉండబోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. వచ్చే కొద్ది వారాల్లో కోవిడ్ 19 మృతులు భయంకరంగా నమోదవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే దేశాన్ని లాక్‌డౌన్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అమెరికాని లాక్‌డౌన్ చేయడం వల్ల కరోనా వైరస్ వ్యాప్తి తీవ్రతను అరికట్టవచ్చు, దేశాన్ని నాశనం చేయలేమన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యకి చికిత్స చెయ్యాలే తప్ప నివారణ మార్గాల వల్ల వచ్చే అదనపు ప్రయోజనం ఉండదని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

కరోనా విశ్వరూపం చూస్తున్న న్యూయార్క్‌లో రోగులకు చికిత్స అందించడానికి వైద్యుల కొరత ఏర్పడింది. దీంతో లైసెన్స్ కలిగిన వైద్య సిబ్బంది సాయానికి రావాలంటూ నగర మేయర్ బిల్ పిలుపునిచ్చారు. ఏప్రిల్, మే నెలల్లో 45 వేల మంది వైద్య సిబ్బంది అవసరం ఉ ంటుందన్నారు. మిలటరీలో పనిచేసే వైద్య సిబ్బందిలో వెయ్యి మందిని అత్యవసర సేవల కోసం న్యూయార్క్‌కు పంపించారు. వెంటిలేటర్లకు కొరత ఏర్పడడంతో న్యూయార్క్ నగరానికి చైనా వెయ్యి వెంటిలేటర్లను పంపింది. మొత్తం 17 వేల వెంటిలేటర్లు అవసరం ఉందని మేయర్ అంటున్నారు. ఇకపోతే ఇప్పటికే వివిధ దేశాల్లో రోగులకు చికిత్స అందించడానికి ఆస్పత్రులు సరిపోవడం లేదు. రేయింబగళ్లు పనిచేయలేక వైద్యులు అలిసిపోతున్నారు. ప్రపంచ దేశాల్లో ఇటలీ తర్వాత అత్యధిక కరోనా మృతులు స్పెయిన్‌లో నమోదయ్యాయి. ఆదివారం ఒక్క రోజే 674 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం మృతుల సంఖ్య 13 వేలకు చేరువలో ఉంది. కేసులు లక్షా 40 వేలు దాటేశాయి. ప్రపంచానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కరోనా వైరస్‌పై యుద్ధం చేయడానికి పరస్పరం సహకరించుకోవాలని అమెరికా, భారత్ నిర్ణయించుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలో పలు అంశాలపై చర్చించుకున్నారు. ప్రపంచ దేశాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి నెలకొన్న ఈ సమయంలో ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ, ఆయుర్వేద వైద్యవిధానం ప్రాముఖ్యతపైన కూడా ఇద్దరు నేతలు చర్చించారు. కోవిడ్19 రోగులకు ఇచ్చే హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందుల్ని పంపించాలని ట్రంప్ కోరారు.మలేరియా వ్యాధిని అరికట్టే క్లోరోక్విన్ టా÷-లబెట్లు కరోనా వైరస్‌ను నిర్మూలించడంలో సత్ఫలితాలు చూపిస్తున్నాయని భావిస్తూ ఉండడంతో అమెరికా కొన్నాళ్ల క్రితమే భారత్‌కి ఆర్డర్ పెట్టుకుంది. భారత్‌లో కూడా కరోనా కేసులు ఎక్కువ కావడంతో క్లోరోక్విన్ ఎగుమతుల్ని ఈ నెల 4న భారత్ నిషేధించింది. దీంతో ట్రంప్ ఫోన్ చేసి మోదీతో మాట్లాడారు. తమ కంపెనీలు ఆర్డర్ చేసిన క్లోరోక్విన్ మాత్రల్ని పంపాలని విజ్ఞప్తి చేశారు. భారత్ క్లోరోక్విన్ మాత్రలను భారీ స్థాయిలో తయారు చేస్తోంది. నా విజ్ఞప్తిపై భారత్ సీరియస్‌గానే ఆలోచిస్తోందని అన్నారు.

# జిల్లా వ్యాప్తంగా అధికారుల అప్రమత్తం

### పాజిటివ్ కేసుల నమోదుతో ప్రజల్లో ఆందోళన

ఆదిలాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): రోజురోజుకూ కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తమయ్యారు. కొద్దిరోజులుగా ప్రపంచదేశాలను తీవ్ర కలవరానికి గురిచేస్తున్న కరోనా వైరస్ జిల్లాను తాకింది. ఇన్ని రోజుల పాటు ప్రశాంతంగా ఉన్న జిల్లా తబ్లిగీ జమాత్ కారణంగా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జిల్లా వ్యాప్తంగా 73 మంది మర్కజ్‌కు వెళ్లిరాగా వారిలో 45 మంది కరోనా పరీక్షల రిపోర్టులు వచ్చాయి. వీరిలో 10 మందికి కరోనా లక్షణాలు ఉన్నట్లు తేలింది. జిల్లాకు చెందిన 97 మంది అనుమానితుల రక్త నమూనాలను అధికారులు హైదరాబాద్‌కు పంపారు. వీరిలో ఒకరికి పాజిటివ్, మరో 34మందికి నెగటివ్ అని నిర్దారణ అయింది. మరో 62మంది రిపోర్టులు ఇవాళ వెల్లడి కానున్నాయి. జిల్లా కేంద్రంలో వైద్య బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. అంతా ప్రశాంతంగా ఉ ందనుకున్న సమయంలో ఒక్కసారిగా 'మర్కజ్' కేసులు నమోదవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్‌లో పది మందికి కరోనా పాజిటివ్ అని వెలుగులోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదిలాబాద్ పట్టణం లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆరు గురికి, నేరడిగొండకు చెందిన ముగ్గురికి, ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఇంకా 28 మంది రిపోర్ట్స్ రావాల్సి ఉ ంది. పాజిటివ్ వచ్చిన వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు.

జిల్లాలో ఒకే రోజు పది కరోనా కేసులు నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు కరోనా వైరస్ ప్రబలకుండా పక్కా ప్రణాళికలతో పకడ్బందీ చర్యలు చేపట్టారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని గుర్తించి క్వారంటైన్ చేయడంతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలనూ మూసివేశారు. అధికార యంత్రాంగం అనుమానితులను గుర్తించడంతో పాటు ఈ మహమ్మారి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు లు నమోదు చేశారు. తబ్లిగీ జమాత్ కార్యక్రమానికి జిల్లా నుంచి 73 మంది వెళ్లారు. ఆదిలాబాద్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు ఉట్నూర్, నేరడిగొండ, మావల నుంచి మర్కజ్‌కు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. మర్కజ్‌కు వెళ్లిన 73 మంది రక్త నమూనాలు సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. ఇందులో 45 మంది రిపోర్ట్స్‌రాగా 10 మందికి పాజిటివ్ వచ్చింది. ఇంకా 28 మంది రిపోర్ట్స్ రావాల్సి ఉంది. మర్కజ్ వెళ్లివచ్చిన వారు ఎందరితో కాంటాక్ట్ అయ్యారోనని జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఐసోలేషన్ వార్డులో కరోనా పాజిటివ్‌గా వచ్చిన వారిని గాంధీ దవాఖానకు తరలించారు. జిల్లాలో కరోనా వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. హస్నాపూర్ గ్రామంలో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో అధికారులు సోడియం హైపోక్లోరైట్ స్ప్రే చేశారు.

# వణుకుతున్న కర్నూలు జిల్లా

### ఢిల్లీ నుంచి వచ్చిన వారితో పెరిగిన పాజిటివ్ కేసులు

### నంద్యాలో 48 గంటలు కర్ఫ్యూ అమలు

### పరిస్థితిని సమీక్షించి చర్యలు తీసుకుంటున్న కలెక్టర్

కర్నూలు,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): నంద్యాలలో కరోనా పాజిటివ్ కేసులు వెల్లడైన నేపథ్యంలో అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన కట్టుదిట్టమైన లాక్‌డౌన్ అమలు చేసేందుకు నిర్ణయించారు. సోమవారం నుంచి 48 గంటలపాటు నిర్బంధ కర్ఫ్యూ అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ ప్రకటించారు. 48 గంటల వ్యవధిలో ప్రజలు ఎవరూ కూడా ఇళ్ళల్లో నుంచి బయటకు రాకూడదని, రోడ్లపై కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 48 గంటల కర్ఫ్యూ తరువాత నిత్యావసర వస్తువులు, కూరగాయలను సైతం ప్రజల ఇంటి వద్దకే చేర్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలందరూ కరోనా విపత్తును కట్టడి చేసేందుకు సహకరించాలని, స్వీయ నిర్బంధంలో ఉండి భాగస్వామ్యులు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలో పది, రూరల్‌లో రెండు కేసులు నమోదు కావడం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. ఈ దృష్ట్యా ఆయా ప్రాంతాలను ప్రభుత్వ అధికారులు రెడ్ జోన్లుగా ప్రకటించారు. ఢిల్లీ కాంటాక్ట్ లిస్టింగ్ కరోనా ప్రమాద ఘంటికలు తారస్థాయికి చేరాయి. ఒకే ఒక్క రోజు 52 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కర్నూలు జిలాలో కరోనా బాధితుల సంఖ్య 56కి చేరింది. ఈ కేసుల సంఖ్య మరో రెండు రోజుల్లో రెట్టింపు అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటిదాకా నమోదైన కరోనా కేసుల్లో ఏకంగా 55 మంది ఢిల్లీ సభకు వెళ్లి వచ్చినవారే కావడం గమనార్హం. మార్చి 24 నుంచి ఢిల్లీ కాంటాక్ట్ లిస్టింగ్‌పై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో చర్యలు మొదలయ్యాయి. జిల్లాలో మార్చి 26 నుంచి అధికారులు వారిని గుర్తించడం ప్రారంభించారు. అందుబాటులోకి వచ్చిన వారిని తక్షణమే క్వారంటైన్‌కు తరలించారు. కానీ వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో జాప్యం చేశారు. వైరస్ లక్షణాలు కనిపించిన వ్యక్తులకే పరీక్షలు చేయిస్తూ కాలయాపన చేశారు. కొందరు అధికారులు ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేయించాలని చెప్పినా ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలు లెక్కచేయలేదు. లక్షణాలు కానరాని వారికి నూరు శాతం వైరస్ ఉండదని వితండ వాదానికి దిగారు. చివరకు అరకొర లక్షణాలు ఉన్న వ్యక్తి తొలి పాజిటివ్ కేసుగా తేలింది. దీంతో అధికారులు నిద్ర మేల్కొన్నారు. క్వారంటైన్‌లో ఉన్న అందరి నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించారు. అప్పటికే నాలుగు రోజులు ఆలస్యమైంది. పైగా జిల్లాలో వైరాలజీ ల్యాబ్ అందుబాటులో లేదు. జిల్లాలో తాజా పరిస్థితులను కలెక్టర్ వీరపాండియన్ వివరించారు. ఉదయం నుంచి మూడు విడతలుగా వచ్చిన నివేదికలను అధికారులు విడుదల చేశారు. పాజిటివ్ కేసులను నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌కు తరలిస్తున్నారు. నెగిటివ్ రిపోర్టులు వచ్చిన వారిని మరో 14 రోజులు హోం క్వారంటైన్లలో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరి కోసం హోటళ్ళు, ప్రైవేట్ భవనాలను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన వారిని గుర్తించి క్వారంటైన్‌కు తరలించారు. మార్చి నెలాఖరు నుంచి ఇప్పటివరకు ఇలా 357 మందిని అధికారులు గుర్తించారు. వీరిలో 338 మందికి నమూనాలను అనంతపురం ల్యాబ్‌కు పంపించారు. మూడు విడతలుగా 189 మంది రిపోర్టులు వచ్చాయి. ఇందులో 52 మందికి కరోనా సోకినట్లు తేలింది. 137 మందికి కరోనా లేదని నిర్ధారించారు. మరో 156 మంది రిపోర్టులు రావాల్సి ఉంది. ఆదివారం ప్రకటించిన పాజిటివ్ జాబితాలో కర్నూలు, నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, కోడుమూరు తదితర ప్రాంతాల వారు ఉ న్నారు. విదేశాలు, ఢిల్లీ సమావేశం నుంచి వచ్చిన 848 మందిని అధికారులు ఇప్పటిదాకా గుర్తించారు. వీరిలో 463 మంది నమూనాలను పరీక్షల నిమిత్తం అనంతపురం ల్యాబ్‌కి పంపారు. ఇందులో 307 మంది నివేదికలు వచ్చాయి. మొత్తం 56 పాజిటివ్ కేసులు, 251 నెగిటివ్ కేసులు నమోదయ్యాయి. పాజిటివ్ కేసుల్లో ఒక్క రాజస్థాన్‌కు వెళ్లొచ్చిన వ్యక్తి మినహా మిగిలిన 55 కేసులు ఢిల్లీ కాంటాక్ట్ కేసులు కావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఢిల్లీ కాంటాక్ట్ లిస్టింగ్‌లో గుర్తించిన వారిని స్థానికంగా అందుబాటులో ఉన్న క్వారంటైన్లకు అధికారులు తరలించారు. వారిలో పలువురికి పాజిటివ్ రావడంతో నెగిటివ్ రిపోర్టులు వచ్చిన వ్యక్తుల్లో ఆందోళన మొదలైంది. వారితో కలిసి ఉన్న కారణంగా తమకూ వైరస్ సోకే ప్రమాదం ఉందేమోనని అధికారుల వద్ద వాపోతున్నారు. దీంతో అధికారులు నిద్రలేచారు. నెగిటివ్ కేసులను ప్రభుత్వ క్వారంటైన్ నుంచి హోం క్వారంటైన్లోకి మార్చేందుకు చర్యలు ప్రారంభించారు. అందుబాటులో ఉన్న హోటళ్లు, ప్రైవేట్ భవనాలను అధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. క్వారంటైన్ ప్రాంతాల్లోని రెవెన్యూ, మునిసిపల్ అధికారులకు ఈ మేరకు ఆదేశాలు అందాయి. క్వారంటైన్‌సెంటర్లలో వ్యక్తుల మధ్య భౌతిక దూరం ఉండేలా బెడ్లు, సౌకర్యాలు కల్పించే విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోలేదు. పైగా కొందరు ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా రాయలసీమ యూనివర్శిటీలోని కరోనా అనుమానితులను స్వేచ్ఛగా బయట తిరిగేందుకు అవకాశం ఇచ్చారు. క్వారంటైన్లో ఉన్నవారికి కలిసే అవకాశం కొందరు ప్రజాప్రతినిధులకు కల్పించారు. పాజిటివ్ కేసులు భారీగా వెలుగులోకి రావడంతో అధికారులు ఇపుడు విమర్శలు ఎదుర్కొంటున్నారు.

# కరోనాతో పోరాటం చేస్తూనే..రైతుల కోసం కృషి చేస్తున్న రాష్ట్రం తెలంగాణ



సిద్దిపేట, ఏప్రిల్ 6: 'ఓవైపు కరోనా మహమ్మారిపై పోరాటం చేస్తూనే..రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి నిమిషం ఆలోచిస్తారు. రైతులకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీఎం కేసీఆర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని' మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సిద్ది పేట జిల్లా గజ్వేల్ మండలం దాచారం గ్రామంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు.

దళారులు లేకుండా రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. క్వింటాలుకు రూ.4875 మద్దతు ధరతో శనగలు కొనుగోలు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 7770 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. త్వరలోనే మొక్కజొన్న, వరి, పొద్దు తిరుగుడు కొనుగోళ్ల కేంద్రాలను ప్రతి మండలంలో ప్రారంభిస్తాం. పండించిన పంటను కొనుగోలు చేసేందుకు రూ.30వేల కోట్ల డబ్బును ప్రభుత్వం కేటాయించింది. కరోనా వైరస్ అంటే సిగ్గుపడాల్సిన రోగం కాదు..మీకు దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి ఉంటే వెంటనే అధికారులను లేదా ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించండి. రైతులు కూరగాయలు విక్రయించేందుకు మార్కెట్‌కు వెళ్లేందుకు పోలీసులు ప్రత్యేక పాసులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చామని హరీశ్ రావు పేర్కొన్నారు.

## ఏపిలో పెరుగుతున్న కరోనా కేసులు

### కొత్తగా మరో ఇద్దరు మృత్యువాత

### పరిస్థితిని సమీక్షించిన సిఎం వైఎస్ జగన్

### ర్యాపిడ్ సర్వేలు చేయాలని అధికారులకు ఆదేశాలు

### కర్నూలు జిల్లాలో పర్యటించిన మంత్రుల బృందం

అమరావతి,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా కేసుల పెరుగుదలతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అనంతపురం, కృష్ణా జిల్లాల్లో రెండు మరణాలతో వాటి సంఖ్య మూడుకు చేరింది. మరోవైపు కేసుల సంఖ్య పెరిగింది. కొత్తగా 14మందికి వైరస్ గుర్తించారు. రాష్ట్రంలో నమోదైన 266 కేసుల్లో 243 ఢిల్లీకి వెళ్లి వచ్చిన వారని తెలిపారు. ఢిల్లీ వెళ్లినవారు, వారి ప్రైమరీ కాంటాక్టులకు దాదాపు పరీక్షలు పూర్తయ్యాయని, దీని తర్వాత ఇంటింటి సర్వేద్వారా లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. రెడ్‌జోన్ల వారీగా క్లస్టర్లు విభజించి అక్కడకూడా ర్యాండమ్ పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనాపై సమీక్ష నిర్వహించారు. సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో మంత్రి మోపిదేవి వెంకటరమణ, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతం సవాంగ్, వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలోని కరోనా పరిస్థితులను ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం సీఎం జగన్ స్పందిస్తూ.. పరీక్షలకు సరిపడా టెస్టు కిట్లు తెప్పించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్వారంటైన్లు, ఐసోలేషన్ కేంద్రాల్లో సదుపాయాలకు ఎలాంటి లోటు రాకూడదని స్పష్టంచేశారు. ఐసీయూ బెడ్లకు సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. కరోనా వైరస్ విపత్తు వల్ల చీనీ, బత్తాయి, అరటి, టమోటా రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని, ఈ విషయంలో ప్రభుత్వం నుంచి నిధుల రూపంలో, ఇతరత్రా రూపంలో నూటికి నూరుపాళ్లు సహకారం అందిస్తానని అధికారులకు స్పష్టంచేశారు. 1902కు వచ్చే కాల్స్ పరిష్కారంపై దృషిపెట్టాలని, సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు కర్నూలు జిల్లాలో కరోనా వైరస్ పంజా విసిరింది. ఏపీలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో పాజిటివ్ కేసులు నమోదు కావడం గమనార్హం. ఇక్కడ మొత్తం 56 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. నిన్న ఒక్కరోజే 52 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పాజిటివ్ వచ్చిన 56 కేసుల్లో 55 కేసులు ఢిల్లీ జమాత్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన వారివే కావడం గమనార్హం. ఇవాల్టి నుంచి కర్నూలు జిల్లాలో లాక్‌డౌన్ నిబంధనలను అధికారులు మరింత కఠినతరం చేశారు. ఈ క్రమంలో ఏపీ మంత్రులు రంగంలోకి దిగారు. సోమవారం నాడు జిల్లాలోని నాగలాపురం సమీపంలో ఉన్న విశ్వభారతి కోవిడ్ ఆస్పత్రిలో మెడికల్ సదుపాయాలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని), ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మంత్రి గుమ్మనూరి జయరాం, జిల్లా కలెక్టర్ జి.వీరపాండియన్ పరిశీలించారు.

## విశాఖలో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

### 15 వేలమంది వాలంటీర్లకు శానిటైజర్లు,మాస్కల పంపిణీ

### బాబు విమర్శలపై మండిపడ్డ విజయసాయి రెడ్డి

విశాఖపట్టణం,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): విశాఖలో 7500 పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు.15 వేల మంది వాలంటీర్లకు శానిటైజర్లు,మాస్కలను తమ ట్రస్ట్ తరపున పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. లాక్‌డౌన్ సమయంలో విశాఖలోని పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించిన 'ప్రగతి భారత్ ఫౌండేషన్' వారికి వెయ్యి రుపాయల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ప్రగతి భారత్ ఫౌండేషన్‌కు గౌరవ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, అవంతి శ్రీనివాస్ పాల్గొని పారిశుధ్య కార్మికులకు సరుకులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పారిశుధ్య కార్మికులకు కూడా ఉచితంగా నిత్యావసర సరుకులు అందివ్వబోతున్నట్లు వెల్లడించారు. పోలీసులకు, హోంగార్డులకు, జర్నలిస్టులకు సైతం ప్రగతి భారత్ ఫౌండేషన్ తరపున నిత్యావసర సరుకులు అందించనున్నామన్నారు. విశాఖలో చిక్కుకుపోయిన ఇతర రాష్ట్రాల వారికి ట్రస్ట్ తరపున భోజన సదుపాయం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తక్కువ ఆర్థిక వనరులు ఉన్నప్పటికీ కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట÷-రలోని నిరుపేద కుటుంబాలని ఆదుకుంటున్నారని ప్రశంసించారు.లాక్‌డౌన్ సమయంలో ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సీఎం పిలుపుకి స్వచ్ఛంద సేవా సంస్థలు స్పందించి.. పేదలని ఆదుకోవడానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. భౌతిక దూరాన్ని పాటించడం ద్వారా కరోనా నియంత్రించగలమన్నారు. విపత్కర పరిస్థితుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అండగా నిలబడం హర్షణీయమన్నారు. లాక్‌డౌన్ కాలంలో వీరికి నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేస్తున్న ప్రగతి భారత్ ఫౌండేషన్‌ను అభినందించారు. ప్రభుత్వం తరపున కూడా అండగా ఉండాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌ది అని ప్రశంసించారు. ఇదిలావుంటే కరోనా కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటోందని వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి అన్నారు. వ్యాధి నియంత్రణలో అధికార యంత్రాంగం వెన్నుతడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్కడా చిన్న లోపం తలెత్తకుండా చూసుకుంటు న్నారని తెలిపారు. పేదలకు వెయ్యి చొప్పున వలంటీర్లు పంపిణీ చేస్తే ఎల్లో మీడియా విషపు రాతలు రాస్తోందని ఆరోపించారు. కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శలు చేయడంపై విజయ సాయిరెడ్డి విశాఖలో మండిపడ్డారు. 'పొరుగు రాష్ట్రంలో కూర్చుని రాళ్లు విసరడం కాదు. కరోనా నుంచి కోలుకుని ఆసుత్రులనుంచి డిశ్చార్జి అయిన వారితో మాట్లాడితే బాగుంటుంది. చికిత్స ఎలా జరిగింది, వసతులెలా ఉన్నాయి, డాక్టర్లు ఎంత శ్రద్ధ తీసుకున్నది తెలుస్తుంది. కోడి గుడ్డుపై ఈకలు పీకడమేనా? కాలంతో పాటు మారక పోతే ఎలా బాబూ?' అని విజయ సాయిరెడ్డి విమర్శించారు.

## పోలీసు వాహనాలకు యాంటీవైరస్ శానిటైజేషన్



కరీంనగర్, ఏప్రిల్ 6(నేటినిజం ప్రతినిది): ప్రస్తుత లాక్‌డౌన్, కర్ఫ్యూల సందర్భంగా కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న వాహనాలతోపాటు, వివిధ విభాగాలకు చెందిన పోలీస్‌శాఖ వాహనాలకు సోమవారంనాడు యాంటీవైరస్ శానిటైజేషన్ నిర్వహించారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ముందుకుజాగ్రత్త చర్యగా ఈ యాంటీవైరస్ శానిటైజేషన్‌ను చేపట్టారు. కరీంనగర్‌లోని కాకతీయ టయోట షోరూం వారి సహకారంతో ఈ శానిటైజన్ కొనసాగింది. విధినిర్వాహణలో ఉన్న పోలీసులు వైద్యుల సూచనలు, తగు జాగ్రత్తలను తీసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. అత్యవసర విధులను నిర్వహించే ఉద్యోగులకు ఎలాంటి ఆకంటం కలిగించకుండా సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ(యంటివో) జానీమియా, టయోటషోరూం మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధికి కోటి విరాళం

### జగన్‌కు అందచేసిన ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల

అమరావతి,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా నివారణ చర్యల కోసం పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు నియోజకవర్గ ప్రజలు, వ్యాపార వేత్తలు, వర్తక, వాణిజ్య సంఘాలు సీఎం సహాయనిధికి కోటి రూపాయల విరాళం అందించాయి. ఈమేరకు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి 1 కోటి 4 లక్షల 7 వేల 838 రూపాయల చెక్కును అందజేశారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి రవి కిరణ్ ప్రధానమంత్రి సహాయ నిధికి రూ.38 లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు విజయవాడలో నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.విద్యాసాగర్‌ను కలిసి ముప్పై ఎనిమిది లక్ష రూపాయల చెక్కును అందించారు. క్లిష్ట పరిస్థితుల్లో నిర్మాణరంగ కార్మికుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని రవికిరణ్ అన్నారు



ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి కరోనా కిట్లను పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్.

# కరోనా సేఫ్టీ కిట్స్‌ను అందజేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్




మహబూబ్‌నగర్,ఏప్రిల్ 6: సీఎం కేసీఆర్ పిలుపు మేరకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కరోనా వైరస్ వ్యాప్తిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. తన నియోజకవర్గ పరిధిలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పర్యటించి ప్రజలకు తగు సూచనలు ఇస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో కరోనా విధులు నిర్వహిస్తున్న వారికి ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, కరోనా సేఫ్టీ కిట్స్‌ను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగింది. అనంతరం శాలీమర్ ఫంక్షన్ హాల్లో తయారు చేస్తున్న వంటలను మంత్రి పరిశీలించారు. కరోనా విధులకు హాజరవుతున్న పోలీసు, మున్సిపాలిటీ, మెడికల్‌తో పాటు ఇతర సిబ్బంది ఉచితంగా భోజనం పంపిణీ చేస్తున్నారు. జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఇండస్ట్రియల్ కారిడార్‌లో పారిశ్రామిక కంపెనీల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు.

నేటి కవిత




# 14 తర్వాత లాక్‌డౌన్‌ను కొనసాగిస్తారా లేక ఎత్తేస్తారా?

## ప్రధాని మోడీ వ్యాఖ్యల్లో ఆంతర్యంపై అంతా ఆసక్తి
## దేశంలో ఇప్పుడు సర్వత్రా ఇదే చర్చ

న్యూఢిల్లీ,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): ఈనెల 14 తర్వాత లాక్‌డౌన్‌ను కొనసాగిస్తారా లేక ఎత్తేస్తారా అన్న దానిపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. లేదా లాక్‌డౌన్‌ను కొనసాగించే పక్షంలో ఏయే రంగాలకు మినహాయింపులిస్తారు? ఎవరిని రోడ్లపైకి అనుమతిస్తారు? ఇవన్నీ సాధారణ పౌరులను తొలుస్తున్న ప్రశ్నలు. అయితే లాక్‌డౌన్ ఎత్తేసే విషయంపైనే ఈ నెల 3న 16 మందితో కూడిన 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్' సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. దీనికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించగా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే బిజెపి కార్యకర్తలకు ప్రధాని మోడీ ఇచ్చిన సందేశంలో చేసిన సూచనలు ఆంతర్యం ఏమిటన్నదానిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

కరోనాపై సుదీర్ఘ పోరాటం తప్పదన్న మోడీ మాటలు ఒక విషయాన్ని చాలా స్పష్టంగా సూచిస్తున్నాయని, ఏప్రిల్ 14 తర్వాత లాక్‌డౌన్‌ను ఎత్తేసే పరిస్థితులు కనిపించడం లేదని పలువురు విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ విషయాలను వెల్లడించారని చెబుతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... ఏప్రిల్ 14 న లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత.... మే 15 నుంచి రెండోదశ లాక్‌డౌన్ విధిస్తే ఎలా ఉంటుందని కేంద్ర మంత్రుల మధ్య చర్చ వచ్చినట్లు సమాచారం. అయితే మొదటి దశ లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత ఏ దుకాణాలు తెరవాలి? ఏ దుకాణాలు మూసి ఉంచాలన్నది కూడా మంత్రులు చర్చించారని తెలుస్తోంది. వ్యాధి ప్రబలిన ప్రాంతాల్లో లాక్‌డౌన్ ఎత్తేయకుండా మిగతా ప్రాంతాల్లో కొనసాగించే అంశం కూడా చర్చించారని తెలుస్తోంది. నిత్యావసర సరుకుల దుకాణాలు తెరిచే ఉంచాలని, అయితే ప్రజలు గుమిగూడటంపై మాత్రం నిషేధం కొనసాగించాలని వారు భావించినట్లు సమాచారం. సినిమా థియేటర్లు, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, ప్రార్థనా మందిరాలను మాత్రం తెరవకూడదన్న నిబంధన విధించాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే నిత్యావసరాలను అమ్మే మాల్స్‌కు మాత్రం మినహాయింపు ఇస్తే బాగుంటుందని భావించినట్లు సమాచారం. విమాన సర్వీసులు తిరిగి ప్రారంభించాలని, అయితే ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే విదేశీయులకు అనుమతులిస్తే ఎలా ఉంటుందన్న దానిపై కూడా చర్చ జరిగింది. అయితే కరోనా వైరస్‌తో బాగా ప్రభావితమైన ప్రాంతాల్లో మాత్రం వారంతంలకు అనుమతి ఇవ్వకూడదని, రాష్ట్రమంతటా కోవిడ్ – 19 పై అవగాహన కల్పించేందుకు అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక అధికారులను నియమించాలని మంత్రులు భావించారు.

ఈ నిర్ణయాలేవీ అధికారికంగా తీసుకోనప్పటికీ, అత్యంత కీలకమైన 16 మంది కేంద్ర మంత్రులు పాల్గొన్న సమావేశంలో మాత్రం ఈ ప్రతిపాదనలన్నీ కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. అయితే లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత పరిస్థితిని బట్టి మే 15 నుంచి రెండో దశ లాక్‌డౌన్ విధించాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. మరోవైపు క్వారంటైన్‌లో ఉంటున్న వారిని జీపీఎస్ ట్రాకర్స్ ద్వారా ఎప్పటి కప్పుడు అధికారులు, బాధ్యులు పర్యవేక్షించాలని, అయితే ఇది ఎంత వరకు సాధ్యమనేది మంత్రులు చర్చించారు. 'వర్క్ ఫ్రం హోం' చేసే ఉద్యోగులకు మరో నెల పాటు ఇదే వసతి కొనసాగిస్తే బాగుంటుందని మంత్రులు అభిప్రాయపడినట్లు సమాచారం. ఇక ఆసుపత్రుల్లో కూడా అత్యధికంగా రద్దీ లేకుండా ఆయా యాజమాన్యాలే బాధ్యత వహించేలా చూడాలని మంత్రుల బృందం భావించినట్లు సమాచారం.

# రాజీవ్ కనకాల ఇంట విషాదం

హైదరాబాద్,ఏప్రిల్ 6: రాజీవ్ కనకాల తండ్రి దేవదాసును పోగొట్టుకొని కనీసం ఏడాది కూడా కాలేదు, అంతలోనే సోదరి శ్రీలక్ష్మి మృతి చెందింది. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం తుదిశ్వాస విడిచింది. దీంతో సుమ కనకాల కుటుంబం కన్నీరుమున్నీరయింది. శ్రీలక్ష్మి ఇప్పటివరకు ఎన్నో సీరియల్స్‌లో నటించి, పలు అవార్డులు కూడా అందుకున్నది. కాగా ఆమె భర్త సీనియర్ జర్నలిస్ట్ పెద్ది రామారావు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. శ్రీలక్ష్మి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులుగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సుమతో శ్రీలక్ష్మికి ప్రత్యేక అనుబంధం. ఇద్దరూ కలిసి సీరియల్స్‌లో నటించారు. రాజీవ్ సుమతో ఇంతటి అనుబంధం ఉన్న శ్రీలక్ష్మి ఒక్కసారిగా చనిపోవడంతో సుమ ఇంట విషాద ఛాయలు అలముకున్నాయి. లాక్‌డౌన్ సమయంలో ఎవరూ వారి ఇంటికి వెళ్లకుండా కుటుంబసభ్యులే దగ్గరుండి ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని టీవీ సీరియల్ నటుడు హర్షవర్ధన్ తెలిపారు. ఆడియో మేసేజ్ ద్వారా సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

# నాణ్యతలేని బియ్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు

## రానున్న పది రోజులు అత్యంత కీలకం
## మర్కజ్ నుంచి వచ్చిన 10 మందిని మణుగూరు క్వారంటైన్‌కు తరలింపు
## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి

÷రిత్తగూడెం,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): రేషన్ షాపుల్లో నాణ్యతలేని బియ్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వాటిని పక్కన పెట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి డీలర్లకు సూచించారు. రేషన్‌షాప్‌లను తనిఖీ చేసి మ్యానువల్‌గా ఉచిత బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. అధికారుల ఫోన్‌నెంబర్లు, ధరల డిస్ప్లే చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. చంద్రుగొండకు చెందిన జహీర్‌హుస్సేన్ సౌదీ ఆరేబియా నుంచి వచ్చి, క్వారంటైన్ పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. కరోనా వ్యాధి నియంత్రణకు కొరత రాకుండా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా మాస్క్‌లు తయారు చేయించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ సూచించారు. రానున్న పది రోజులు అత్యంత కీలకమైనవని, ప్రజలు బయటకు రాకుండా నియంత్రించేందుకు మొబైల్ వాహనాల ద్వారా వస్తువులు విక్రయించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంవీ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మర్కజ్ నుంచి వచ్చిన 10 మందిని గుర్తించి మణుగూరులో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రానికి తరలించామని, కుటుంబ సభ్యులు, సన్నిహితులు 56 మందిని గుర్తించి ఇంటిలో క్వారంటైన్ చేశామన్నారు. నాలుగు పాజిటివ్ కేసుల్లో ఇద్దరు వ్యక్తులు గాంధీ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం వైద్యులు వారిని డిశ్చార్జ్ చేశారని, మరో ఇద్దరు చికిత్స పొందుతున్నా రన్నారు. రానున్న పది రోజుల్లో కరోనా వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎంవీరెడ్డి తెలిపారు. ఐసీయూ, ఐసోలేషన్ వార్డులతో పాటు క్వారంటైన్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. రానున్న రోజులను దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, అవసరమైన పీపీఈ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రజలను పరిశీలించేందుకు ప్రతి చెక్‌పోస్టులో స్క్రీనింగ్ యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి 15,029 మంది వ్యవసాయ, ఇతర కార్మికులను గుర్తించి వారి జీవనోపాధికి 12 కేజీల బియ్యం, రూ.500 నగదు పంపిణీ చేశామన్నారు.

# దివ్యాంగులు, వృద్ధులకు సర్కార్ అండ

## ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు: మంత్రి కొప్పుల

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నెలకొన్న కరోనా మహమ్మారి తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న లాక్‌డౌన్ నేపథ్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు వచ్చే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారికి ఏవైనా అత్యవసర పరిస్థితుల్లో సహకరించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటుచేసింది. వృద్ధుల కోసమైతే 14567 నెంబర్‌కు, దివ్యాంగుల కోసం 1800–572–8980కు ఫోన్‌చేయాలని దివ్యాగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ పేర్కొంది. రాష్ట్రంలోని ఏ మూల నుంచయినా దివ్యాగులు, వృద్ధుల అవసరాల కోసం టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేస్తే ఆ ఫోన్‌కాల్ రికార్డు చేసి దానిని వారి జిల్లా సంక్షేమఅధికారికి బదిలీచేస్తారు. అప్పుడు జిల్లా సంక్షేమ అధికారి , వారి సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వారికి సహాయ సహకారాలు అందిస్తారని అధికారులు తెలిపారు. అంతే కాకుండా ఏమైనా వైద్య సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 104కి ఫోన్ చెయాలని,రాష్ట్ర దివ్యాంగుల , సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. కరోనా మహమ్మారి పై ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధంలో యుద్ధంలో ప్రజలు, ప్రభుత్వము, వైద్య బృందాలు, పోలీస్‌శాఖ, మున్సిపల్‌సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది నిరంతరం సేవలు అందిస్తారని అన్నారు సీనియర్ సిటీజన్స్ కోసం పనిచేసే నిరుపేదల సంస్థల మధ్య మెరుగైన సమన్వయం కోసం రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 104 వయోవృద్ధుల ఆశ్రమంలో సుమారు 3500 వృద్దులు ఉన్నారని, వారికి, మానసిక వికలాంగ పిల్లలకు సంబంధించిన హాస్టల్స్‌లో ఉన్న వారికి ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు దివ్యాంగులు , వయోవృద్ధుల సంక్షేమశాఖ సంచాలకులకు సూచనలు జారీ చేశామని అన్నారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ వారికి కావల్సిన నిత్యావసర వస్తువులతో పాటు మెడిసిన్, మాస్కులను, శానిటైజర్లను, డైపర్స్‌లను పంపిణీ చేస్తామని తెలిపారు.

# ఏప్రిల్ చివరినాటికి కరోనా తగ్గుదల: చైనా సైంటిస్ట్ ఝాంగ్ నన్షాన్

హైదరాబాద్, ఏప్రిల్ 6: ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా మహమ్మారి ఏప్రిల్ చివరి నాటికి తగ్గుముఖం పడుతుందని చైనా శాస్త్రవేత్త ఝాంగ్ నన్షాన్ అభిప్రాయపడ్డారు. అందుకు చైనా, ఇటలీ ఘటనలే కారణమని చెప్పుకొచ్చారు. ఇటలీలో మొదటగా వేగంగా విస్తరించిన కరోనా ఇప్పుడు పెరుగుదలలో తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ఇటలీ తర్వాత వ్యాపించిన అమెరికాలో... ఇప్పుడు కేసులు పెరుగుతున్నాయని, రానున్న రోజుల్లోవాటి పెరుగుదలలో తగ్గుదల మొదలవుతుందని చెప్పారు. ఇక అమెరికా తర్వాత కరోనా వ్యాపించిన ఇండియాలో ఇప్పుడు కేసుల సంఖ్య పెరుగుతూ... ఏప్రిల్ చివరి నాటికి... కంట్రోల్ అయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇలా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ కాస్త అటూ ఇటుగా ఏప్రిల్ నెలాఖరుకల్లా కంట్రోల్ అవుతుందని ఝాంగ్ నన్షాన్ అంచనా వేస్తున్నారు. ఇక కరోనా వైరస్ నానాటికీ బలహీనం అవుతుందని..చైనాలో మళ్లీ విజృంభించే అవకాశమే లేదన్నారు. ముఖ్యంగా ప్రపంచ దేశాలు చేపట్టిన లాక్‌డౌన్ వైరస్ నియంత్రణలో బాగా పనిచేసిందని పేర్కొన్నారు.

# కేంద్రాల వారీగా ధాన్యం కొనుగోళ్లు

## ముందే రైతులకు కూపన్ల జారీ
## మంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి

వనపర్తి,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు లాక్‌డౌన్ నేపధ్యంలో రైతులు తమ పంటలు నష్టపోకుండా ప్రభుత్వం ప్రణాళికా ప్రకారమే పంటలను కొనుగోలు చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆయా రైతులు పండించిన పంటల కోత ప్రకారమే కొనుగోలుచేస్తున్నామని తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తికాకుండా వ్యవసాయ మార్కెట్లన్నీ మూసివేశామన్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎక్కడిక్కడ ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు సామాజిక దూరం పాటించాలన్నారు. కేంద్రాల వారీగా ధాన్యం అమ్మకానికి వ్యవసాయ అధికారుల ద్వారా కూపన్లు జారీ చేస్తున్నామని వెల్లడించారు. సోమవారం వనపర్తిజిల్లా రేవల్లి, గోపాలపేట, పెద్దమందడి, ఖిల్లాఘణపురం,చవనపర్తి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలను కొనుగోలుచేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 7077 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. కూపన్ల ప్రకారమే రైతులు తమకు కేటాయించిన సమయానికి ధాన్యం అమ్మకానికి తీసుకు రావాలన్నారు. మొక్కజొన్న సేకరణకు రూ.3213 కోట్లు, వరిధాన్యం సేకరణకు 25వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. రైతులు అందించిన బ్యాంకు ఖాతాలకు నేరుగా ధాన్యం డబ్బులు జమ చేస్తామన్నారు. కరోనా నేపధ్యంలో లాక్‌డౌన్ అమలు మూలంగా డబ్బు రెండు రోజులు ఆలస్యమైనా రైతులు ఆందోలన చెందవద్దన్నారు.

రైతులు చెమటోడ్చి పండించిన ప్రతి పంట విపత్కర పరిస్థితుల మూలంగా నష్టపోకూడదన్నదే సీఎం కేసీఆర్ ఆలోచనగా ఆయన తెలిపారు.

## కరోనాపై ప్రభుత్వం విఫలం-పిటీషన్ విచారించిన హైకోర్టు

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనాపై రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాగా ఈ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ చౌహాన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిటిషన్‌ను విచారించారు. కరోనాపై జనవరి 30నే డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. పట్టణాల్లో అందరికీ పరీక్షలు చేయాలని, ఇంటికే నిత్యావసరాలు పంపాలని పిటిషనర్ పేర్కొన్నారు. కాగా కేంద్రం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు తెలిపింది. ఏప్రిల్ 9న మధ్యంతర నివేదిక, 15న తుదినివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది.

# లాక్ డౌన్ ఎఫెక్ట్‌తో ఆగిన దిగుమతులు

## ఆరున్నరేళ్ల కనిష్టానికి బంగారం దిగుమతి

ముంబై,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాధిని అడ్డుకునేందుకు విధించిన దేశ వ్యాప్త లాక్ డౌన్ బంగారం దిగుమతులపై కూడా భారీ ప్రభావాన్ని చూపింది. దీంతో దేశీయంగా బంగారం దిగుమతులు మార్చిలో రికార్డు కనిష్టానికి పడిపోయాయి. వార్షిక ప్రాతిపదికన 73 శాతానికి పైగా పడిపోయిన పసిడి దిగుమతి ఆరున్నర ఏళ్ల కనిష్ట స్థాయికి చేరుకుంది. ప్రపంచంలోనే బంగారానికి రెండో అతిపెద్ద దిగుమతిదారు అయిన భారత్‌కు మార్చి నెలలో దిగుమతులు ఏకంగా 73 శాతం పడిపోయాయి. వాల్యూ పరంగా మార్చి దిగుమతులు దాదాపు 63 శాతం తగ్గి 1.22 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2019 మార్చిలో 93.24 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకోగా, ఈ ఏడాది మార్చిలో కేవలం 25 టన్నులకు పడిపోయిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. గత ఆరున్నర సంవత్సరాల్లో ఇదే అతితక్కువ దిగుమతి. కరోనా మహమ్మారి వేగంగా విస్తరింస్తుండటంతో దాదాపు ప్రపంచమంతా లాక్‌డౌన్ పరిస్థితుల్లోకి వెళ్లిపోవడం, అంతర్జాతీయ రవాణా పూర్తిగా స్తంభించిపోవటంతో దిగుమతులపై ప్రభావం పడింది. అలాగే లాక్‌డౌన్ కారణంగా దేశంలో బంగారం దుకాణాలు మూత పడటం ఒకప్రధాన కారణమని బులియన్ వ్యాపారస్తులు తెలిపారు.




వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.

# ప్రధాని సహాయ నిధికి రెబల్ స్టార్ కృష్ణంరాజు కుటుంబ విరాళం



హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రపంచమంతా కరోనా కరాళ నృత్యం చేస్తున్న వేళ సమాజంలోని అన్ని వర్గాల వారు స్పందించాల్సిన అవసరం ఉంది " అన్నారు సుప్రసిద్ధ నటులు, నిర్మాత, మాజీ కేంద్ర మంత్రి రెబల్ స్టార్ కృష్ణంరాజు. ఆయన కుటుంబ సభ్యులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రిలీఫ్ ఫండ్ కు 10 లక్షల రూపాయల విరాళాన్ని అందజేసిన సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ " కరోనా సృష్టించిన విపత్కర పరిస్థితులను అధిగమించటానికి డాక్టర్లు, నర్సులు , పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు, మీడియా ఇంకా అనేక శాఖల వారు అహర్నిశలు శ్రమిస్తున్నారు. వారి త్యాగం, కష్టం వెలకట్టలేనివి. అందుకే ఈ కష్టకాలంలో ప్రతి ఒక్కరూ స్పందిస్తూ తమ శక్తి మేరకు విరాళాలుఅందజేస్తున్నారు. మా కుటుంబం నుండి మా పెద్దమ్మాయి సాయి ప్రసీద, రెండవ అమ్మాయి సాయి ప్రకీర్తి, మూడవ అమ్మాయి సాయి ప్రదీప్తి తాము దాచుకున్న పాకెట్ మనీ నుండి తలా రెండు లక్షలు చొప్పున ప్రధాని రిలీఫ్ ఫండ్ కు ఇస్తామని ముందుకు వచ్చారు. అలాగే నా శ్రీమతి శ్యామలా దేవి ఏప్రిల్ 13న తన జన్మదిన సందర్భంగా నాలుగు లక్షల రూపాయలను ప్రైమ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ కు ఇస్తానని చెప్పింది. కాబట్టి మొత్తం 10 లక్షల విరాళాన్ని ఈరోజు ప్రధానమంత్రి సహాయనిధికి పంపించడం జరిగింది. కేవలం ఆర్ధిక సహకారమే కాకుండా ఈ కరోనా విపత్తును అధిగమించడానికిమన ప్రియతమ ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు మార్చి 22న జనతా కర్ఫ్యూ విజయానికి సంకేతంగా చప్పట్లు కొట్టడం, నిన్న ఏప్రిల్ 5న కొవ్వొత్తులు వెలిగించి మద్దతు ప్రకటించడం వంటి విషయాలలో కూడా ప్రతి ఒక్కరూ ముందుండాలని కోరుకుంటున్నాను. మా కుటుంబం మొత్తం ఈ పోరాటంలో పాల్గొంటున్న నందుకు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది " అన్నారు.

## అడ్డా247 తన టెక్-ఎనేబుల్డ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో విద్యార్థుల కోసం ఉచిత స్టడీ మెటీరియల్

హైదరాబాద్, ఏప్రిల్ 6:నాణ్యమైన విద్యను సులువుగా పొందడం ద్వారా విద్యార్థులను శక్తివంతం చేయాలనే దాని లక్ష్యాన్ని అందిస్తూ, టెస్ట్ తయారీ కోసం భారతదేశపు అతిపెద్ద మరియు వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్య–సాంకేతిక సంస్థ అడ్డా 247, విద్యార్థులు మరియు కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లకు ప్రయోజనకరమైన మరియు అభినందన అభ్యాస కార్యక్రమాలను ప్రకటించింది. కరోనా మహమ్మారి మధ్య. బ్యాంకులు, ఎస్ఎస్‌సి, టీచింగ్, డిఫెన్స్, పిసిఎస్ మొదలైన వాటికి పరీక్షల సన్నాహాల కోసం విద్యార్థులకు ఉచిత తరగతులు నిర్వహించడానికి తన అత్యాధునిక ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోవడానికి అడ్డా 247 ఆఫ్‌లైన్ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లను ఆహ్వానించింది. అడ్డా 247 విద్యార్థులకు ఉచిత అధ్యయన సామగ్రిని కూడా వ్యాప్తి చేస్తోంది దాని డిజిటల్ అభ్యాసం. ఆన్‌లైన్ టెక్ ప్లాట్‌ఫాం పరిశ్రమ నిలువు వరుసలో మొదటిది, అతను విద్యార్థులకు అవసరమైన పాఠాలను వ్యాప్తి చేయడానికి సంస్థ యొక్క అధునాతన ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోవటానికి ప్రవీణ ఆఫ్‌లైన్ ట్యూషన్ కేంద్రాలను పిలవడం ద్వారా గంట యొక్క స్పష్టమైన అవసరాన్ని ఎనేబుల్ చేస్తున్నాడు. పాన్–ఇండియా లాక్డౌన్ కారణంగా కోచింగ్ ఇన్స్టిట్యూట్స్ మూసివేయబడిన సందర్భంలో, అటువంటి ప్రయత్నం వారి జ్ఞాన వక్రతను పెంచడంలో చాలా విలువైనదిగా రుజువు చేస్తుంది. మొదట, నిశ్చితార్థాన్ని పెంచడానికి, అడా 247 విద్యార్థులకు ఉచిత మాక్ పరీక్షల రూపంలో కమ్యూనిటీ కార్యకలాపాల కోసం చ 21 డేస్ ఛాలెంజ్‌ను ప్రారంభించింది. పరీక్షా తయారీకి కోర్సులను సరసమైన ధరలకు ప్లాట్‌ఫాం అందిస్తోంది. ఈ గొప్ప మరియు ఆలోచనాత్మక సంజ్ఞ గురించి అడిడా 247 సిఇఒ మరియు వ్యవస్థాపకుడు అనిల్ నగర్ మాట్లాడుతూ, "ఇది మొత్తం మానవ జాతికి నిజంగా ప్రయత్నించే కాలం, ఇది అన్ని దేశాల ఇంటెలిజెన్స్ మరియు వనరుల సమన్వయ సహకారం ద్వారా మాత్రమే అధిగమించగలదు. ప్రపంచం. కానీ కష్టాలు వాస్తవానికి ఎంత కష్టపడినా, మానవ స్వభావానికి పరీక్ష అని కూడా ఇది నిజం. మన ప్రయత్నాలను మరియు మన ప్రార్థనలను ప్రపంచంతో ఏకం చేయడం ద్వారా ఈ విపత్కర మహమ్మారిని అధిగమిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.